ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -330 పేజీలు - 08 వెల - 04/- గురువారం 23 అక్టోబర్ 2025

# 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' తో వేగంగా అనుమతులు

## ఏపీలోని పెట్టుబడుల అవకాశాలను వివరించిన సీఎం

- యూఏఈలో సీఎం చంద్రబాబు..
- పెట్టుబడులే లక్ష్యంగా తొలిరోజు భేటీలు
- తొలిరోజు భారత రాయబారులు, పారిశ్రామికవేత్తలతో భేటీ
- విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రస్తావన
- యూఏఈలోని తెలుగువారికి అండగా నిలవాలని ఎంబసీకి విజ్ఞప్తి



అమరావతి, **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు తన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటనను ప్రారంభించారు. పర్యటనలో భాగంగా తొలిరోజైన బుధవారం ఆయన దుబాయ్‌లో పారిశ్రామికవేత్తలు, భారత రాయబార కార్యాలయ అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను వారికి వివరించి, ఏపీకి రావాల్సిందిగా ఆహ్వానించనున్నారు. తొలిరోజు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు, దుబాయ్‌లోని భారత కాన్సుల్ జనరల్ సతీశ్ కుమార్ శివన్, అబుదాబీలోని డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, పోర్టులు, లాజిస్టిక్స్, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను ఆయన వారికి వివరించారు.

మిగతా 2లో...



# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు

### అబద్ధాలతో దబాయించడం చంద్రబాబుకు అలవాటు

### పోస్టర్ రిలీజ్ చేసిన వైకాపా నేత సజ్జల తదితరులు

అమరావతి, **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి** ఏపీలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈనెల 28న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ధర్నాలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, అరుణ్ కుమార్, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, కారుమూరి నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్ హయాంలో ఏడు మెడికల్ కాలేజీలు పూర్తి అయ్యాయిమిగతా 2లో...



# 15 శాతానికి తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..

- అమెరికాతో భారత్ డీల్..!
- భారత ఎగుమతులపై ప్రస్తుతం 50 శాతం వసూలు చేస్తున్న అగ్రరాజ్యం
- త్వరలో ఇరు దేశాల మధ్య కుదరనున్న ఒప్పందం..
- అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ఎంట్రీ..!

2లో.

# స్పోర్ట్స్ హబ్ దిశగా ఏపీ

## బ్రిస్బేన్‌లో పాపులస్ సంస్థ ప్రతినిధులతో మంత్రి నారా లోకేశ్ భేటీ

- ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్న లోకేశ్
- ప్రపంచ ప్రఖ్యాత స్టేడియాల నిర్మాణంలో పాపులస్ సంస్థకు ప్రత్యేక గుర్తింపు
- అత్యాధునిక క్రీడా సౌకర్యాల కల్పనకు సహకరించాలని విజ్ఞప్తి
- పర్యావరణహిత, కమ్యూనిటీ క్రీడా సముదాయాల డిజైన్లు అందించాలని కోరిక
- పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా ప్రణాళికలు



అమరావతి, **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్చర్ సంస్థ 'పాపులస్' ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన క్రీడా మైదానాలకు రూపకల్పన చేసిన ఈ సంస్థ సహకారంతో ఏపీలో అంతర్జాతీయ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మిగతా 2లో...

# దక్షిణ ఏపీకి రెడ్ అలర్ట్

భారీ వర్షాలతో
తమిళనాడు అతలాకుతలం..
ఇద్దరు మహిళలు మృతి
బంగాళాఖాతంలో అల్పపీడనం..



2లో.

# తెలంగాణ రవాణా చెక్ పోస్టుల ఎత్తివేత

### సిఎం ఆదేశాలతో తక్షణ చర్యలు

### ఆగమేఘాలమీద రవాణా శాఖ నిర్ణయం


### నంబర్ ప్లేట్ రికగ్నేషన్ అమలు

హైదరాబాద్, **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**
:తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రహదారులపై ఉన్న రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంచలన ఆదేశాలిచ్చారు. దీంతో తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సాయంత్రం 5 గంటల్లోగా మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం రేవంత్ ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఆకస్మిక, తక్షణ ఆదేశాలు జారీ చేశారుమిగతా 2లో...



# అయ్యప్ప సన్నిధిలో రాష్ట్రపతి ముర్ము

- శబరి గిరుల్లో చారిత్రక ఘట్టం..
- ఇరుముడితో పడిమెట్లెక్కిన రాష్ట్రపతి..
- శబరిమలలో ముర్ము ప్రత్యేక పూజలు



2లో.

# రెండేళ్లలో ఉస్మానియా నూతన ఆసుపత్రి పూర్తి చేయాలి

### రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్, **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**
ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి కొత్త భవనాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మిగతా 2లో...



# పీపీపీ మోడల్‌లోనే కాలేజీల నిర్మాణాలు

### ఐదేండ్లలో మెడికల్ కాలేజీ నిర్మాణం జరగలేదు

### : మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి, **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**
మెడికల్ కళాశాలల నిర్మాణం పీపీపీ మోడల్‌లోనే జరుగుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం మెడికల్ కాలేజ్‌ల నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. ఐదు వేలకోట్లు పనులకు ఐదు వందలకోట్ల పనులు చేశారన్నారు. పులివెందులలో మాత్రమే జగన్.. మెడికల్ కళాశాలను పూర్తి చేశారని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో పది మెడికల్ కళాశాలలుమిగతా 2లో...

## 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' తో
# వేగంగా అనుమతులు

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నంలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేయనుందన్న విషయాన్ని ఈ సమావేశంలో ప్రస్తావించారు. రాష్ట్రానికి ఉన్న 1054 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం ద్వారా తమ ప్రభుత్వం వేగంగా అనుమతులు మంజూరు చేస్తోందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. యూఏఈలోని వివిధ సావరిన్ ఫండ్స్ నుంచి ఏపీకి పెట్టుబడులను ఆకర్షించే అంశంపై కూడా ఈ భేటీలో ప్రత్యేకంగా చర్చించారు. ఇదే సమయంలో, యూఏఈలో నివసిస్తున్న తెలుగు ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సీఎం చంద్రబాబు ఎంబసీ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. "ప్రధాని మోదీ కృషితోనే భారత్‌లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ఆయన ప్రపంచవ్యాప్తంగా భారతదేశ బ్రాండ్‌ను ప్రచారం చేస్తున్నారు. ఆయన వల్లే భారత్-యూఏఈ మధ్య వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలు బలపడ్డాయి" అని చంద్రబాబు అన్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.

# దక్షిణ ఏపీకి రెడ్ అలర్ట్

అమరావతి **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**

తమిళనాడును భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. కడలూరు జిల్లాలో కుండపోత వానకు ఓ నివాసం కూలిపోవడంతో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రాబోయే 24 గంటల్లో తీరం దాటే అవకాశం ఉండటంతో తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా జిల్లాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.

వాతావరణ శాఖ తమిళనాడులోని చెంగల్‌పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుతురై జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, కడప జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ ప్రకటించింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాల నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రెడ్ అలర్ట్ జారీ అయిన జిల్లాలకు 12 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సహాయక శిబిరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చెంగల్‌పట్టు కలెక్టర్ డి. స్నేహ మాట్లాడుతూ, "వర్షాలకు ముందే పూడికతీత పనులు పూర్తి చేశాం. నీటిని తోడే పంపులు, సహాయక కేంద్రాలు, కమ్యూనిటీ కిచెన్లు సిద్ధంగా ఉన్నాయి" అని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని 13 జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. తూత్తుకుడి, తిరువారూర్ జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. నాగపట్నం, తిరువారూర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, బోట్లు, చెట్లను తొలగించే యంత్రాలతో పాటు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచారు.

# తెలంగాణ రవాణాచెక్ పోస్టుల ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించు కోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. అలాగే చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డీటీవో కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని హుకుం జారీ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి రవాణా అవుతోంది. కొందరు

అధికారులు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని యథేచ్ఛగా అక్రమ వసూళ్లు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రవాణాశాఖ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ జులై ఆఖరి వారంలోనే రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నెలరోజులు ఆలస్యంగా జీఓ జారీ అయ్యింది. ఉత్తర్వులు వచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా చెక్‌పోస్టులను ఇంకా తొలగించలేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చెక్‌పోస్టుల అవసరం దాదాపుగా తగ్గింది. కేంద్రం సూచనల మేరకు దేశంలోని అనేక రాష్ట్రాలుసంవత్సరాల క్రితమే చెక్‌పోస్టులను రద్దు చేశాయి. కానీ తెలంగాణలో కొనసాగుతున్నాయి. ఏడాదిన్నర క్రితమే తెలంగాణలో చెక్‌పోస్టుల రద్దుకు రవాణాశాఖ నిర్ణయం తీసుకున్నా.. కొందరు అధికారుల బలమైన ఒత్తిళ్ల కారణంగా ఇన్నాళ్లు ఆ నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు రెండు నెలల క్రితం జీఓ జారీ అయినా అవినీతి అధికారుల తీరు మారలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టులు రద్దు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టులను ఎత్తివేసిన ప్రభుత్వం వాటి స్థానంలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్‌పీఆర్) అనే అడ్వాన్స్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానుంది. ఈ అడ్వాన్స్?డ్ కెమెరా సిస్టమ్ హైదరాబాద్ లోని ఖైరతాబాద్ లో ఉన్న ప్రధాన రవాణా శాఖ ఆఫీస్‌కు అనుసంధానమై ఉంటుంది. దీంతో రవాణా శాఖలో పారదర్శకత స్పష్టంగా కనిపించనున్నది. అయితే, ప్రస్తుతం డ్యూటీ చేస్తున్న సిబ్బందికి కొత్త బాధ్యతలు అప్పగించనున్నారు. ఏ వెహికల్ అయినా కెమెరా కండ్లుగప్పి ఇతర మార్గాల ద్వారా రాష్ట్రంలోకి వస్తే.. వాటిని జాతీయ రహదారులపై అడ్డుకొని చర్యలు తీసుకునేందుకు వీలుగా మొబైల్ స్క్వాడ్ లను కూడా రంగంలోకి దింపనున్నారు. ఈ వ్యవస్థపై ముందుగా గూడ్స్ ట్రాన్స్?పోర్ట్ చేసే వాహన యజమానుల అసోషియేషన్ కు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించ నున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్యాసింజర్ వెహికల్స్‌తో పాటు సరకు రవాణా వాహనాల పర్మిట్లు, మిగిలిన అనుమతులన్నీ ముందే ఆన్ లైన్ లో పొందేలా రాష్ట్ర రవాణా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అనుమతుల్లేకుండా లేదా నిబంధనలు ఉల్లంఘించి రాష్ట్రంలోకి ప్రవేశిస్తే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు 15 చెక్ పోస్టుల అంతరాష్ట్ర చెక్ పోస్టుల దగ్గర విధుల్లో ఉన్న సుమారు 70 మంది ఎంవీఐలు, ఏఎంవీఐలు, ఇతర సిబ్బందిని ప్రస్తుతం రవాణా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించనున్నారు. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారులపై రవాణా సమస్యలు లేకుండా, సాఫీగా ప్రయాణం జరిగేందుకు వీలుగా చెక్ పోస్టులను ఎత్తేయాలని గతంలోనే కేంద్రం ఆయా రాష్ట్రాలను ఆదేశించింది.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగానిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

అబద్దాలు చెప్పి దబాయించడం చంద్రబాబు అలవాటే. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను అన్ని వర్గాల ప్రజలకు వ్యతిరేకిస్తున్నారు. వైఎస్ జగన్ ఒకేసారి 17 మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన చేశారు. కోవిడ్ తర్వాత ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి అయ్యాయి. కూటమి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంది. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గ చర్య. దీనిపై ప్రజల్లో కూడా వ్యతిరేకత బాగా పెరిగింది. ప్రభుత్వం వెనక్కు తగ్గే వరకు పోరాటం చేస్తాం. ఇది రాజకీయాల కోసం కాదు, రాష్ట్ర భవిష్యత్తు కోసమే. ఈనెల 28న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో నిరసన ర్యాలీలు చేస్తాం. ప్రజాస్వామ్య వాదులంతా హాజరు కావాలని కోరుకుంటున్నాం. ఇప్పటికే కోటి సంతకాల సేకరణ ఉధృతంగా జరుగుతోంది. ప్రజల అభిప్రాయాన్ని



గవర్నర్ దృష్టికి తీసుకెళ్తాం. స్వచ్ఛందంగా ప్రజా సంఘాలు, మేధావులు ఈ పోరాటంలో పాల్గొంటున్నారు. అందులో భాగంగానే ఈనెల 28న అసెంబ్లీ నియోజకవర్గాలలో ర్యాలీలు చేయబోతున్నాం. తర్వాత నవంబర్ 12న జిల్లా కేంద్రాలలో కూడా ర్యాలీలు చేస్తాం. కోటి సంతకాలు పూర్తి చేసుకుని వాటిని నవంబర్ 23న జిల్లాలకు తరలిస్తాం. అనంతరం కేంద్ర కార్యాలయానికి వస్తాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణను ఆపాలి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్యం, వైద్య విద్యను అందించాలన్నది వైఎస్ జగన్ ఉద్దేశం. అందుకే 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చారు. మెడికల్ కాలేజీల నిర్మాణాలు ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతాయి. ఒక్కరోజులో ఏ కాలేజీ పూర్తి కాదు. ఎయిమ్స్ లాంటి సంస్థ పూర్తవటానికే తొమ్మిదేళ్లు పట్టింది. పులివెందుల కాలేజీ పూర్తయినా చంద్రబాబు సీట్లు రాకుండా అడ్డుకున్నారు. పాడేరు కాలేజీకి 50 సీట్లు చాలని మిగతావి రాకుండా అడ్డుకున్నారు. సంవత్సరానికి వెయ్యి కోట్లు చొప్పున నాలుగైదేళ్లు ఖర్చు చేస్తే కాలేజీలన్నీ అందుబాటులోకి వస్తాయి. పీపీపీ అంటే ప్రయివేటీకరణ కాదని చంద్రబాబు కొత్త భాష్యం చెప్తున్నారు. లాభాల కోసమే ప్రైవేటు వ్యక్తులు మెడికల్ కాలేజీలతో వ్యాపారం చేస్తారు. ఇప్పటికే ఎవరెవరికి ఏ కాలేజీని దోచి పెట్టాలో నిర్ణయం తీసుకున్నారు. ఇక పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. ఇలాంటి విధ్వంసాన్ని ఏపీలో ఎప్పుడూ చూడలేదు. కానీ, తన మీడియా పవర్‌తో ఎదుటి వారిపై విమర్శలు చేస్తున్నారు' అని అన్నారు.

# స్పోర్ట్స్ హబ్ దిశగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

పాపులస్ సంస్థ సీనియర్ ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ షాన్ గల్లఘర్, ఆసియా పసిఫిక్ బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ ఎలిజిబెత్ డిసిల్వాలతో మంత్రి లోకేశ్ చర్చలు జరిపారు. 40 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న పాపులస్ సంస్థ.. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ (సర్దార్ పటేల్) స్టేడియం, లండన్ ఒలింపిక్ స్టేడియం, న్యూయార్క్‌లోని యాంకీ స్టేడియం వంటి 3,500కు పైగా ప్రాజెక్టులను డిజైన్ చేసింది. ప్రస్తుతం భారత్‌లో ఎల్ అండ్ టీ సంస్థతో కలిసి పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై పనిచేస్తోంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ఏపీలో క్రీడారంగాన్ని బలోపేతం చేసేందుకు సహకరించాలని కోరారు. "రాష్ట్రంలో అత్యాధునిక స్పోర్ట్స్ స్టేడియంలు, శిక్షణా కేంద్రాల నిర్మాణానికి మీ డిజైన్ సహకారం అందించండి. పర్యావరణ హితమైన, ఇంధన సామర్థ్యం గల క్రీడా, వినోద వేదికల నిర్మాణంలో ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి" అని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు కమ్యూనిటీ క్రీడా సముదాయాలు, పర్యాటకాన్ని, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా ఇంటిగ్రేటెడ్ ఈవెంట్ స్పేస్‌ల రూపకల్పనలో కూడా భాగస్వాములు కావాలని ఆయన ఆహ్వానించారు.

### భారత రొయ్యల దిగుమతికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఆస్ట్రేలియా

అమెరికా విధించిన భారీ సుంకాలతో తీవ్రంగా దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ రొయ్యల పరిశ్రమకు భారీ ఊరట లభించింది. దాదాపు ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత, భారత రొయ్యల దిగుమతికి ఆస్ట్రేలియా షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేసింది. ఈ పరిణామం దేశీయ రొయ్యల ఎగుమతుల్లో 80 శాతం వాటా కలిగిన ఏపీ రైతులకు కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఏడు రోజుల పర్యటనలో ఉన్న ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ శుభవార్తను స్వయంగా ప్రకటించారు. "భారత సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులకు ఎప్పటినుంచో అడ్డంకిగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. వైట్ స్పాట్ వైరస్ కారణంగా ఆస్ట్రేలియా విధించిన పరిమితులు తొలగిపోయాయి. భారత రొయ్యలకు తొలి దిగుమతి అనుమతి లభించింది. ఇది ఈ రంగంలో ఒక పెద్ద ముందడుగు" అని లోకేశ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపారు.

2017 జనవరిలో కొన్ని రొయ్యల సరుకుల్లో 'వైట్ స్పాట్ వైరస్' గుర్తించడంతో ఆస్ట్రేలియా ప్రభుత్వం భారత్ నుంచి పొట్టు తీయని రొయ్యల దిగుమతులపై నిషేధం విధించింది. అప్పటి నుంచి భారత ఎగుమతిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు, ఇటీవల ట్రంప్ హయాంలో అమెరికా ప్రభుత్వం భారత రొయ్యలపై 59.72 శాతం వరకు సుంకాలు విధించడంతో ఏపీ రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతంలో ఏపీ నుంచి 70 శాతం రొయ్యలు అమెరికాకే ఎగుమతి అయ్యేవి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మార్కెట్ తిరిగి తెరచుకోవడం కీలకంగా మారింది.

అయితే, ఈ అనుమతులు కొన్ని కఠినమైన షరతులకు లోబడి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. "ఆస్ట్రేలియా కొన్ని షరతులతో ఒక కన్సైన్‌మెంట్‌కు అనుమతి ఇచ్చింది. వ్యాధి రహిత జోన్లలో సేంద్రియ పద్ధతిలో పెంచిన రొయ్యలను మాత్రమే దిగుమతి చేసుకోవాలనేది కొత్త నిబంధన. రొయ్యలను డీవెయిన్ చేసి, ఫ్రోజెన్ స్థితిలో పంపాలనే పాత షరతులు కూడా ఉన్నాయి" అని ఆక్లాండ్‌కు చెందిన హ్యాస్పర్ బ్రాండ్ ల్యాబ్స్ ప్రతినిధి దిలీప్ మద్దుకూరి వివరించారు. ఈ తాజా పరిణామం అమెరికా మార్కెట్‌లో సవాళ్లను ఎదుర్కొంటున్న ఏపీ రైతులకు కొత్త అవకాశాలను అందిస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

# 15 శాతానికి తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..

### అమెరికాతో భారత్ డీల్..!

**అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**

మనదేశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్ లు తగ్గనున్నట్లు పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరనుందని పేర్కొన్నాయి. ప్రస్తుతం భారత్ నుంచి అమెరికాలోకి దిగుమతి అవుతున్న వస్తువులపై 50 శాతం పన్ను వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో రష్యా నుంచి చమురు దిగుమతి చేస్తున్నందుకు ట్రంప్ 25 శాతం ప్రతీకార సుంకాలు కూడా ఉన్నాయి. అయితే, ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదురుతుందని, ఆ తర్వాత ట్రంప్ సుంకాలు 15 శాతానికి తగ్గే అవకాశం ఉందని తెలిపాయి. రష్యా నుంచి తగ్గనున్న దిగుమతులు ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ తగ్గించనుందని, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను భారత మార్కెట్లోకి అనుమతించనుందని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనం వెల్లడించింది. కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ కూడా వాణిజ్య ఒప్పందం ఖరారుపై విశ్వాసం వ్యక్తంచేశారు.

వ్యవసాయ ఉత్పత్తుల కోసం ట్రంప్ పట్టు..

భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందంలో అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు కీలకంగా మారాయి. తమ వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ తలుపులు బార్లా తెరవాలని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్ కు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో చర్చలు ముందుకు సాగడంలేదు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరపడంపైనా ట్రంప్ ఆగ్రహంగా ఉన్నారు. అయితే, ఇటీవల జరిగిన చర్చల్లో ఈ అంశాలపై పరస్పర అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది.

### భారత మార్కెట్లలోకి అమెరికా మొక్కజొన్న

రష్యా నుంచి దిగుమతులు క్రమంగా తగ్గించడంతో పాటు అమెరికా మొక్కజొన్న, సోయామీల్‌ను కూడా భారత మార్కెట్లోకి అనుమతించే అవకాశం ఉన్నట్లు సదరు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే మొక్కజొన్నపై 15 శాతం దిగుమతి సుంకం కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ట్రేడ్ వార్ పరిస్థితుల నేపథ్యంలో అమెరికా నుంచి మొక్కజొన్న దిగుమతులను చైనా తగ్గించుకుంది. ఈ పరిస్థితుల్లో తమ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ట్రంప్ ప్రత్యామ్నాయంగా భారత మార్కెట్లలోకి ఎంట్రీ ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు.

## పీపీపీ మోడల్‌లోనే కాలేజీల నిర్మాణాలు

(మొదటి పేజీ తరువాయి)

పీపీపీ విధానంలో పూర్తి చేస్తామని ప్రకటించారు. జగన్ బెదిరింపులకు ఎవరూ తగ్గేది లేదన్నారు. ఆయన వచ్చి కట్టే వరకు విద్యార్థులు నష్టపోయారని.. అయినా జగన్ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. వైసీపీ వచ్చేది లేదు.. చచ్చేది లేదంటూ వ్యాఖ్యలు చేశారు. పది మెడికల్ కళాశాలు పూర్తి అయితే డెబ్భై శాతం పేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. యాజమాన్య హక్కులు, నిర్వహణ మొత్తం ప్రభుత్వం చేతిలోనే ఉంటాయని వెల్లడించారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్లే నేడు పీపీపీ విధానంలో తాము నిర్మిస్తున్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణం చేయకుండా గాడిదలను కాశారా అంటూ ఫైర్ అయ్యారు. ఇంకా అబద్ధాలు, అసత్యాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారని మంత్రి మండిపడ్డారు. ఉద్దానం విషయంలో కూడా రాద్దాంతం చేస్తున్నారని.. ఇలా చేస్తే 11 సీట్లు కూడా ఈసారి రావన్నారు. ప్రజలు చిత్తుగా ఓడించారని జగన్ కక్ష కట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగకుండా అడ్డు పడుతున్నారన్నారు. అన్ని విషయాలు ప్రజలు గమనిస్తున్నారని.. వాళ్లకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎన్టీఆర్ వైద్య సేవలపై చర్చిస్తున్నామని.. అన్నీ సర్దుకుంటాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## రెండేళ్లలో ఉస్మానియా ఆసుపత్రి పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు ఆధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లుగా గదుల నిర్మాణం, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో పదిరోజులకు ఒకసారి పర్యటించాలని సూచించారు.

## అయ్యప్ప సన్నిధిలో రాష్ట్రపతి ముర్ము

**అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**

శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం ఒక చారిత్రక ఘట్టానికి వేదికైంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం స్వామివారిని దర్శించుకున్నారు. తద్వారా, ఈ ప్రఖ్యాత పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన తొలి మహిళా దేశాధినేతగా ఆమె చరిత్ర సృష్టించారు. గతంలో 1970లలో మాజీ రాష్ట్రపతి వీవీ గిరి శబరిమలను సందర్శించగా, ఆ తర్వాత అయ్యప్పను దర్శించుకున్న రెండో భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నిలిచారు. కేరళలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె శబరిమలకు చేరుకున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు పంబా బేస్ క్యాంపు వద్దకు వచ్చిన ఆమె, మొదట పంపా నదిలో పాదాలను శుభ్రం చేసుకుని, సమీపంలోని గణపతి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నల్ల చీర ధరించి సంప్రదాయబద్ధంగా 'కెట్టునిర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆమె 'ఇరుముడికెట్టు'ను సిద్ధం చేశారు. రాష్ట్రపతితో పాటు ఆమె అల్లుడు గణేష్ చంద్ర హెూంబ్రామ్, ఇతర సిబ్బంది కూడా ఇరుముడిని సిద్ధం చేసుకున్నారు. పంబ నుంచి ప్రత్యేక వాహనంలో సన్నిధానానికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ తంత్రి కందరారు మహేష్ మోహనారు 'పూర్ణకుంభ' స్వాగతం పలికారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ కూడా ఆమెకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ద్రౌపది ముర్ము పవిత్రమైన ఇరుముడిని తలపై పెట్టుకుని, 18 మెట్లను ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆమె ఇరుముడిని ప్రధాన అర్చకులు తీసుకుని పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మాలికాపురం ఆలయాన్ని కూడా ఆమె సందర్శించారు. రాష్ట్రపతి పర్యటనపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "ఆమె వయసు 67. ఆమె ఏ నిబంధనలను ఉల్లంఘించలేదు, ఏ విశ్వాసాన్ని గాయపరచలేదు %-% కేవలం గౌరవించారు. ఇరుముడితో అయ్యప్పను దర్శించుకున్న తొలి రాష్ట్రపతిగా నిలిచారు" అని ఆయన పేర్కొన్నారు. "భక్తి అనేది నిశ్శబ్దంగానే నిలబడుతుందని ఈ పర్యటన గుర్తుచేసింది. కోట్లాది అయ్యప్ప భక్తులను ఏకం చేసే విశ్వాసానికి ఈ క్షణం అద్దం పడుతోంది" అని ఆయన తన పోస్టులో రాశారు. మహిళల ప్రవేశంపై 2018లో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఒక మహిళా దేశాధినేత ఆలయాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, రాష్ట్రపతి పర్యటన సందర్భంగా సాధారణ భక్తుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు తెలిపారు.

# ఆస్ట్రేలియా మార్కెట్ లోకి ఆంధ్రా రొయ్యలు.

## ఏపీ ఆక్వా రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్త.


## జనసేన పార్టీ నాయకులు దండు మురళీ కృష్ణ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 22:** ఏపీ ఆక్వా రైతులకు కూటం ప్రభుత్వం శుభవార్త తెలిపిందని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు దండు మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఒక దారి మూసుకోపోతే మరొక దారి తెరిపించారు.రొయ్యల దిగుమతి పై అమెరికా భారీగా సుంకాలు విధించడంతో కష్టాల్లో పడిన ఆక్వా రైతులు."అమెరికా కాకపోతే ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశలు పరిశీలించవలసిందిగా కేంద్రాన్ని కోరిన కూటమి ప్రభుత్వం".ఈ సూచన దిశగా కేంద్రం చేసిన కృషి ఫలించింది.ఆంధ్ర రొయ్యకు ఆస్ట్రేలియా మార్కెట్ గేటువే తరించిన రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు.నార లోకేష్ ఆస్ట్రేలియా పర్యటనలో ఉండగానే సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు చూపిన చొరవ, కేంద్ర ప్రభుత్వ ప్రయత్నం... రెండూ సఫలీకృతమై ఏపీ ఆక్వా రైతుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పొట్టు తీయని ఏపీ రొయ్య దిగుమతిపై ఇంత వరకు ఉన్న ఆంక్షలను ఆస్ట్రేలియా ప్రభుత్వం ఎత్తేసింది.రొయ్యల దిగుమతిపై అమెరికా భారీగా సుంకాలు విధించగా, మరో దేశంతో మాట్లాడమని కేంద్రానికి చంద్రబాబు గతంలో సూచించారు.

# నేల బెలుం ఆలయంలో కార్తీక మాస పూజలు మొదలు.





**ఆంధ్ర ప్రగతి కొలిమిగుండ్ల అక్టోబర్22:** బనగానపల్లె నియోజకవర్గం పరిధి కొలిమిగుండ్ల మండలం బంధార్లపల్లె గ్రామ సమీపంలో గల నేల బెలుం శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు బుధవారం నుండి మొదలయ్యాయి. పురాతన సేవ క్షేత్రమైన శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయములో అనాది నుండి కార్తీక మాస పూజలు విశేషంగా జరుపుతున్నారు. ఈ క్రమంలో ఆలయ అర్చకులు రవి స్వామి మరియు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నెలరోజులపాటు కొనసాగనున్నాయి. బుధవారం రోజు ఉదయం శ్రీ మల్లేశ్వర స్వామి వారికి భక్తులు పంచామృత అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఈనెల 27వ తేదీ, నవంబర్ నెల 3, 10, 17 తేదీలలో నాలుగు సోమవారాలు రానున్నాయని, కార్తీక సోమవారాలలో శ్రీ స్వామివార్లకు విశేష అభిషేకాలు మరియు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలియజేశారు. కార్తీక్ చివరి సోమవారం 17వ తేదీ మరియు 18వ తేదీల్లో విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు రోజులపాటు వివిధ పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలియజేశారు. కార్తీకమాస ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి సోమవారము భక్తులకు అన్నదాన కార్యక్రమము నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

# అకాల వర్షంతో అన్నదాత కంట కన్నీరు.!



**ఆంధ్ర ప్రగతి కౌతాళం అక్టోబర్ 22:** మండలంలోని వివిధ గ్రామాల్లో నిన్న కురిసిన భారీ వర్షానికి పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి.

ముఖ్యంగా నదిచాగి మేలిగనూరు కుంబలనూరు తో పాటు వివిధ గ్రామాల్లో వరి ధాన్యం పూర్తిగా నెలకొరిగి తీరని నష్టాన్ని మిగిల్చింది, ఓ వైపు కోతలు ప్రారంభమై ఇంకో వారంలో చేతికొస్తుందనుకున్న వరి ధాన్యం ఇలా నేల పాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు, వరి కోతకు గంటకు 1 ఎకరా సాగుతున్న పరిస్థితి నుండి ఇలాంటి పరిస్థితుల్లో 1ఎకరా కోతలు 2- నుండి 3 గంటలు పట్టే అవకాశం ఏర్పడింది మరియు వరి గింజలు భూమిలో పడి ఎకరానికి 2- 3క్వింటాళ్ల పంట తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు.

ముఖ్యంగా సాగుదారునితో పాటు కౌలు రైతులకు సంబంధించిన పంటలే ఎక్కువగా పడిపోవడంతో ఎంత మేర నష్టపోతమేమోనని తీవ్ర దిగ్భ్రాంతోలో పడిపోయారు.

ప్రభుత్వ వ్యవసాయ అధికారులు, పౌరసరఫర శాఖ అధికారులు పొలాల్లోకి వెళ్లి రైతులను సందర్శించి నష్ట పోయిన రైతులకు ఆర్థిక భరోసా తో పాటు కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేసేందుకు సహకరిస్తామని భరోసా కల్పించే కార్యక్రమం చేపట్టాలని రైతులు కోరుకుంటున్నారు.

# ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం.!

## -విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 22:** ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం అని విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో ఆర్ డీ ఎస్ ఎస్ త్రీఫేస్ విద్యుత్ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు, విద్యుత్ శాఖ ఎస్సీ సుధాకర్ ఆధ్వర్యంలో త్రీఫేస్ విద్యుత్ లైన్ పనులకు భూమి పూజ నిర్వహించడం జరిగిందన్నారు.విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందిస్తామన్నారు. నాణ్యమైన విద్యుత్ కోసం ఈ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, శ్రీశైలం దేవస్థానం మాజీ ధర్మకర్త రవి స్వామి, లైన్మెన్ సుబ్రహ్మణ్యం, విద్యుత్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల విద్యార్థులు.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 22:** నంద్యాల, క్రాంతినగర్‌లోని శ్రీ శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సి-బి ఎ టి (ఆచార్య చాణక్య బిజినెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్) ఒలింపియాడ్ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబర్చారు. ఈ పరీక్షలో 6వ తరగతి విద్యార్థి కె. జేస్వంత్ కుమార్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం, 9వ తరగతి విద్యార్థి ఎస్. అఖిల్ షెట్టి రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం సాధించి పాఠశాల గౌరవాన్ని పెంచారు.వారి విజయాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్ విద్యార్థులను అభినందిస్తూ, వారికి మార్గదర్శకత్వం వహించిన ఐఐటీ బృందం కృషిని ప్రశంసించారు.అదే సమయంలో, శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ ఒలింపియాడ్ పరీక్షలో పాల్గొన్న మిగతా విద్యార్థులకు కూడా పాల్గొనిక సర్టిఫికెట్లు అందజేశారు.ఐఐటీ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీ రామకృష్ణ , ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల విజయంపై సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ గారు మాట్లాడుతూ, "మా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడం పాఠశాల ప్రతిష్ఠను మరింతగా పెంచింది. భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాం" అన్నారు.







# ఆరోగ్యశ్రీ వైద్య సేవలను పునరుద్ధరించాలి.

## నెట్వర్క్ హాస్పిటల్ లకు పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలి.

## పేద ప్రజలకు అందించాల్సిన వైద్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 22:** రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 10 నుండి ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలు నిలిచిపోవడం వలన పేద ప్రజలు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక ఇబ్బందులతో తిరిగి వెనక్కి వెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహ కే మహమ్మద్ గౌస్ లు సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడడం జరిగింది. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహులు, కే మహమ్మద్ గౌస్ లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 10 నుండి నెట్వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోవడం జరిగిందని ఎందుకంటే ప్రభుత్వం నెట్వర్క్ ఆసుపత్రులకు దాదాపుగా 2500 కోట్లకు పైగా పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం, నంద్యాల జిల్లాలో దాదాపుగా 150 కోట్ల రూపాయలు పెండింగ్లో ఉండడం వల్ల ఆర్థోపెడిక్, గుండె జబ్బులకు సంబంధించిన ప్రజలు ఆసుపత్రులకు వెళ్లి ఆరోగ్యశ్రీ నిలుపుదల కావడంతో డబ్బులు కట్టలేక, ఉన్న ఇబ్బందులతో ఏమి చేయలేక ఇంటికి వెళ్లి అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం పెండింగ్లో ఉన్న బకాయిలను ఆసుపత్రులకు వెంటనే చెల్లించి ప్రజలందరికీ ఆరోగ్యశ్రీ ని అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేయాలని డాక్టర్లంతా నెట్వర్క్ ఆసుపత్రులలో పేద ప్రజల కోసం అత్యధిక పరికరాలతో ప్రజలకు సేవ చేస్తున్నామని మా పెండింగ్ 80 లక్షల నుండి 20 కోట్ల వరకు ఉన్న బకాయిలను చెల్లించాలని కోరితే కేవలం మూడు లక్షల రూపాయలను చెల్లించడం జరిగిందని ఇది మాకు ఏమాత్రం సరిపోదని ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలు నిలిపివేస్తున్నామని వైద్యులంతా ప్రభుత్వానికి తెలిపిన ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం అంటే ప్రజలకు వైద్యం అందించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పకుండా ఈ నిర్లక్ష్యానికి పేద ప్రజలు బలి కావాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం ద్వారా పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా వైద్య కళాశాలలో సీట్లు ఉన్నాయని, కూటమి నాయకులు చెబుతున్నదొకటి ఆచరణలో ప్రైవేటు, పెట్టుబడిదారులు లాభాల కోసమే అర్జిస్తారు తప్ప పేద ప్రజల కోసం సేవ చేసేందుకు ముందుకు రారని ఇది తెలిసినా కూడా ప్రజలను ఇంకా తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడుతుండడం సిగ్గుచేటని అన్నారు. వైద్య కళాశాలలో పూర్తవ్వాలంటే కేవలం 5000 కోట్లు కేటాయిస్తే సరిపోతుందని, ఆరోగ్యశ్రీ వైద్య సేవలు కొనసాగించాలంటే 2500 కోట్లు నెట్వర్క్ ఆసుపత్రులకు చెల్లిస్తే సరిపోతుందని, కానీ ఇవేమీ పట్టించుకోకుండా విశాఖపట్నంలో ఏర్పాటు చేసే డేటా సెంటర్కు 22వేల కోట్లకు పైగా రుణాలు అందజేసేందుకు మాఫీ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడింది అంటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మిత్రుడైన అదాని సేవలో రాష్ట్ర ప్రభుత్వం తరిస్తుంది తప్ప పేద ప్రజల కోసం కూటమి ప్రభుత్వం లేదని కనీసం విద్యా వైద్యాన్ని అందించలేని ప్రభుత్వం రాష్ట్రంలో ఉందంటే పేద ప్రజలు ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు సిగ్గ పడుతున్నారని, ప్రజలందరూ ఎప్పుడు ఎన్నికలు వస్తాయా ప్రభుత్వానికి ఏ రకంగా బుద్ధి చెప్పాలినా అని వెయిట్ చేస్తున్నారని,ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా, వైద్య సేవలను ప్రజలకు మరింత విస్తరించేలా ప్రభుత్వం విధానాలను చేపట్టాలని, లేకుంటే ప్రభుత్వానికి రాబోయే కాలంలో పుట్టగతులు లేకుండా ప్రజలే చేసేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

# మొక్కజొన్న పంటను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి.

## మొక్కజొన్న, సోయాబీన్, సజ్జ పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

## ౹కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన వైస్సార్సీపీ రైతు విభాగం నాయకులు

**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 22:** మొక్కజొన్న పంట కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర కన్నా రూ. 600 తక్కువగా ఉన్నందున మొక్కజొన్న పంటను మార్క్ ఫెడ్ కొనుగోలు చేయాలని, మొక్కజొన్న సోయాబీన్ సజ్జ పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని వైస్సార్సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి లు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి ని కలిసి వైస్సార్సీపీ రైతు విభాగం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సాగు చేసిన ప్రధాన పంటలు మొక్కజొన్న, సోయాబీన్, సజ్జ పంటలు కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) కంటే తక్కువ ధర వుందన్నారు.

రాష్ట్రం మొత్తం లో మొక్క జొన్న 4 లక్షల ఎకరాలు సాగు జరిగితే నంద్యాల జిల్లాలోనే 1.59 లక్షల ఎకరాలుసాగు జరిగిందన్నారు. మొక్కజొన్న పంట గత నెల రోజులుగా కోతలు జరుగుతున్నాయని, పంటకు ధర మాత్రం రూ.1800 మాత్రమే





లభిస్తుందన్నారు.2025 - 26 కు కేంద్రం ప్రకటించిన మొక్క జొన్న పంటకు కనీస మద్దతు ధర ప్రకారం 2400 రూపాయలని,కాని క్వింటాల్ కు 600/- రూ ధరతక్కువగా మార్కెట్ ఉందన్నారు. కావున మొక్క జొన్న పంటను మార్క్ ఫెడ్ కొనుగోలు చేయాలని తాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.సోయాబీన్ కూడా కనీస మద్దతు ధర రూ. 5328/- ఉంటే కేవలం రూ.3900/- మాత్రమే మార్కెట్ లో కొనుగోలు జరుగుతుందన్నారు.ఆకాల వర్షాలకు రైతులు పంటలను పొలంలోనే చాల వరకు నష్ట పోయారని వచ్చిన అరకొర పంట కూడా ధరపడిపోతే రైతాంగం చాలా వరకు నష్టపోతారన్నారు.

సజ్జ పంట గత 50 రోజుల నుండి మార్కెట్ కు వస్తోందని సజ్జ ఎం ఎస్ పి 2775/- రూ ఉంటే కేవలం రూ.1900

నుండి రూ.2000 కొనుగోలు జరుగుతుందన్నారు. సజ్జ పంట కూడా కనీస మద్దతు ధర కలిపించాలని గతంలో మీ దృష్టికి తీసుకొచ్చామన్నారు.

కావున వెంటనే మొక్కజొన్న, సోయాబీన్, సజ్జ పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గాండ్ల శివరాముడు,రూపేంద్ర కుమార్ రెడ్డి,కురువ దస్తగిరి, వెంకట నారాయణ,రంగడు. కురువ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరు లో కార్తీక మాసం మొదటి రోజున ప్రత్యేక పూజలు..!

-బ్రహ్మముహూర్తంలో స్వామివారికి మహా రుద్రాభిషేకం మరియు అఖండ దీపారాధన కార్యక్రమం.

ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సురేష్ శర్మ్మ.ద -ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.



**ఆంధ్ర ప్రగతి కొత్తూరు పాణ్యం అక్టోబర్ 22:** పాణ్యం మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ఈవో యం.రామక్రిష్ణ ఆధ్వర్యంలో బుధవారం రోజున కార్తీక మాసం మొదటి రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సురేష్ శర్మ, కంపమల్ల నారాయణ శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో స్వామివారికి గందం అభిషేక పూజలు, మహా రుద్రాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి గుడిలో అఖండ దీపారాధన కార్యక్రమాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మరియు టీడీపీ నాయకులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన భక్తాదులందరూ విశేషంగా స్వామి వారిని దర్శించుకున్నారు.





ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ శర్మ మాట్లాడుతూ పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీక మాసం. ప్రతి సంవత్సరం దీపావళి ముగిసిన మరుసటి రోజు కార్తీక మాసం ప్రారంభమవుతుంది. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే ఈ కార్తీక మాసంలో భక్తులంతా శివనామస్మరణలో మునిగితేలుతారు. మిగతా మాసాలతో పోలిస్తే ఈ కార్తీక మాసం ఎంతో పవిత్రమైనది, విశిష్టమైనదని స్కంద పురాణంలో పేర్కొన్నారు. పురాణాల కాలం నుంచి కార్తీక మాసం ఒక విశిష్టతను సంతరించుకుంది. ఈ నెలలో పరమేశ్వరుడిని విశేషమైన భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తారు. ఈ మాసమంతా పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వనభోజనాలు ఇలా భక్తిపారవశ్యంతో మునిగిపోతుంది.

న కార్తీక నమో మాసః
న దేవం కేశవాత్పరం
నచవేద సమం శాస్త్రం
న తీర్థం గంగాయాస్థమమ్ "అంటే కార్తీక మాసానికి సమానమైన మాసం లేదు. శ్రీ మహావిష్ణువుకు సమానమైన దేవుడు లేడు. వేదముతో సమానమైన శాస్త్రం లేదు. గంగతో సమానమైన తీర్థం లేదు అని అర్థం." ఈ కార్తీక మాసంలో పవిత్ర నదిలో లేదా పవిత్ర జలంతో బ్రహ్మ ముహూర్తంలో స్నానం చేయడం ఎంతో విశిష్టత కలిగి ఉంటుంది. కార్తీక మాసంలో బిల్వ పత్రాలతో శివుడిని పూజించడం వల్ల భక్తులకు ఆ సదాశివుడు ప్రసన్నుడై కొంగు బంగారంలా సకల సౌఖ్యాలు కలిగిస్తాడని విశ్వసిస్తారు.



# మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి సన్నిధిలో

## కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి. డి. శివకుమార్ తో కలిసి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి.

ప్రత్యేక పూజా చేసి స్వాగతం పలికి ఆశీర్వదించిన మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు స్వామి.






**ఆంధ్ర ప్రగతి మంత్రాలయం అక్టోబర్ 22:**

మంత్రాలయం లో వెలసిన శ్రీ రాఘవేంద్ర స్వామి సన్నిధిలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శ్రీ డి.శివకూమర్, కర్ణాటక మంత్రి బోసురాజు,మాన్వి ఎమ్మెల్యే హంపయ్య తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి వారి కి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాగతం పలికి శాలువా పూలమాలతో సన్మానించి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. మఠం లో అభివృద్ధి పనులు చేయడం చాలా సంతోషంగా ఉంది. శ్రీ రాఘవేంద్ర స్వామి ఆశీర్వాదం ప్రజలకు రైతులకు అందరికీ ఉండాలని పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పన్నాగా వెంకటేశప్ప స్వామి, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్నాథ్ రెడ్డి, క్రిష్ణా మోహన్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరత్వాజ్ శేట్టి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

-ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బొజ్జా దశరథరామిరెడ్డి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 22:** రాయలసీమ జిల్లాల్లో మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజారపు అచ్చనాయుడు కు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు, తీవ్ర ఇబ్బందులపై అచ్చనాయుడు కు మెయిల్ ద్వారా బొజ్జా లేఖను పంపారు. ఈ సందర్భంగా నంద్యాల సమితి కార్యాలయంలో బొజ్జా ప్రకటనను విడుదల చేస్తూ.. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాయలసీమ ప్రాంతంలోని అనేక మండలాల్లో రైతులు విస్తారంగా మొక్కజొన్నను సాగు చేశారు. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంట దిగుబడి సగానికి తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు క్వింటాలుకు రూ. 2400 కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ, మార్కెట్‌లో



రైతులకు కేవలం రూ. 1500 నుండి రూ. 1800 కంటే ఎక్కువ ధర లభించడం లేదని బొజ్జా దశరథరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పంట పండించిన రైతులు ఈ పరిస్థితుల్లో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఇది వారి ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తుందని ఆయన లేఖలో పేర్కొన్నారు. రైతాంగం చేసిన కృషికి న్యాయం జరుగాలంటే ప్రభుత్వం తక్షణమే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ప్రతి మండల స్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, కనీస మద్దతు ధరకు మొక్కజొన్నలను సేకరించే చర్యలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలి అని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ఆలస్యం జరిగితే, రైతులు నిల్వ సదుపాయాలు లేక, నష్టం భయంతో తక్కువ ధరలకు పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందనీ, తద్వారా రైతాంగం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

?రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ కింజరపు అచ్చంనాయుడు గారు వెంటనే చర్యలు తీసుకొని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కనీస మద్దతు ధరను అమలు చేయాలని దశరథరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నంద్యాల జిల్లా స్థాయి ఓపెన్ చదరంగ పోటీలు.

నవంబర్ రెండవ తేదీ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో.

నంద్యాల జిల్లా చెస్ సంఘం,నంద్యాల లయన్స్ క్లబ్ సంయుక్త నిర్వహణ.

నంద్యాల లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు ఆత్మకూరు సుదర్శనం శెట్టి సౌజన్యంతో నగదు బహుమతులు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 22:** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో, నంద్యాల లయన్స్ క్లబ్,ఎన్.ఆర్.జి.చెస్ అకాడమీ సంయుక్త నిర్వహణలో నవంబర్ రెండవ తేదీ ఆదివారం స్థానిక టేక్కే లో ఉన్న ఈ.ఎస్.సి .ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జింకా డ్రాయింగ్ హాల్ నందు నంద్యాల జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఓపెన్ క్యాటగిరిలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నంద్యాల లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు, పారిశ్రామికవేత్త ఆత్మకూరు సుదర్శనం శెట్టి సౌజన్యంతో వివిధ వయస్సు కేటగిరీలలో పన్నెండు వేల రూపాయల నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేయడం జరుగుతుందని జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ జి. రవి కృష్ణ,టోర్నమెంట్ డైరెక్టర్, పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపల్. శైలేంద్ర కుమార్,ఎన్ ఆర్ జి చెస్ అకాడమీ గౌరవ అధ్యక్షులు రాజేష్, నంద్యాల జిల్లా సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, టోర్నమెంట్ పర్యవేక్షకులు వెంకట్రావు లు తెలిపారు.

ఈనెల 30వ తేదీ లోపు ఆసక్తి గల క్రీడాకారులు ఎంట్రీలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర వివరాలు నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఫోన్ నెంబర్ 9010451585 లో తెలుసుకోవచ్చు.

# రెవెన్యూ సేవలు సకాలంలో అందించాలి.

-జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 22:** సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవల కోసం ఆశతో ప్రజలు దరఖాస్తులు సమర్పిస్తారని, రెవెన్యూ సేవల విషయంలో ఆలస్యాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని 18వ సచివాలయంలో రెవెన్యూ సంబంధిత సేవలలో ఆలస్యాలు ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా, సచివాలయంలో 2025 జనవరి నుండి సెప్టెంబర్ 30 వరకు ప్రజల నుండి అందిన 332 దరఖాస్తులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వాటిలో ఎక్కువశాతం దరఖాస్తులు వివిధ మండలాల్లో ఉన్న భూములకు సంబంధించినవని, సచివాలయ పరిధిలోని ప్రజల భూసంబంధిత అంశాలు ఇతర మండలాలకు చెందినవని ఆమె గుర్తించారు. తనిఖీలో ఒకే ఒక మ్యూటేషన్ దరఖాస్తు మాత్రమే ఎన్జీవోస్ కాలనీ పరిధిలోనిదని, మిగతా 331 దరఖాస్తులు ఇతర మండలాల పరిధిలో ఉన్న భూములపై నమోదై ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ దరఖాస్తులను పరిష్కరించే ప్రక్రియను వేగవంతం చేసేలా సంబంధిత మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ స్థాయిలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే మండల రెవెన్యూ కార్యాలయాలకు పంపించి, సమయపరిమితిలో పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తనిఖీ సమయంలో రెవెన్యూ విభాగ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


# ప్రతి విద్యార్థి తప్పక అపార్ ఐడి కలిగి ఉండాలి.

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 22:** నంద్యాల జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల అపార్ ఐడి నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత విద్యా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అపార్ ఐడి పురోగతిపై క్లస్టర్ హెచ్ఎంలు, ఎంఈఓలు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ, "అంగన్వాడీ స్థాయి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న ప్రతి విద్యార్థి తప్పనిసరిగా అపార్ ఐడి కలిగి ఉండాలన్నారు. ఆధార్ కార్డు ప్రతి పౌరుడికి అవసరమైనట్లు, విద్యార్థులకు అపార్ ఐడి కూడా అంతే ముఖ్యమైనదని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 85 శాతం విద్యార్థులకు అపార్ ఐడి జనరేషన్ పూర్తయిందని, మిగిలిన 15 శాతం విద్యార్థుల ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. అపార్ ఐడి ద్వారా విద్యార్థులకు స్కాలర్షిప్స్, ప్రభుత్వ ప్రయోజనాలు, వివిధ విద్యా పథకాలు సులభంగా అందుతాయన్నారు. కొంతమంది విద్యార్థుల ఆధార్ కార్డుల్లో పేర్లు లేదా వివరాల్లో పొరపాట్లు ఉండటం వల్ల అపార్ ఐడి జనరేషన్ ఆలస్యమవుతోందని గుర్తించిన కలెక్టర్, "ఆధార్ కార్డులో ఉన్న తప్పులను తక్షణమే సరిచేసి ప్రతి విద్యార్థికి అపార్ ఐడి లభించేలా చర్యలు తీసుకోవాలి," అని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా విద్యా అధికారి జనార్ధన్ రెడ్డి, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ.



**ఆంధ్ర ప్రగతి మహానంది, అక్టోబర్ 22:** శ్రీశైలం నియోజకవర్గం మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలో రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. మండల వైసీపీ పార్టీ కన్వీనర్ కొమ్మ మహేశ్వర్ రెడ్డి అధ్యర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలో భాగంగా గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నందు కోటి సంతకాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి మహేశ్వర్ రెడ్డి వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రథమనందీశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి ..!

**- అన్నప్రసాద వితరణ నూతన కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా.**









**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 22:**
నంద్యాల పట్టణంలో కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని శ్రీ కేదారేశ్వరి సమేత శ్రీ ప్రథమ నందిశ్వరు స్వామి దేవస్థానం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ శుభ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎండి. ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు.
కార్తీక మాసం శివారాధనకు అత్యంత పవిత్రమైన మాసం కావడంతో, ఉదయం నుండే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్తీక మాసంలో భక్తులు నియమ నిష్టలతో శివుడిని ఆరాధించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని ఆకాంక్షించారు.

### మంత్రి ఎన్ఎండి ఫరూక్ చేతుల మీదుగా అభివృద్ధి పనుల ప్రారంభం:

ఆలయ అభివృద్ధి మరియు భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పలు కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు.
అన్నప్రసాద వితరణ కేంద్రం ప్రారంభం కార్తీక మాసం నెల రోజుల పాటు నిరాటంకంగా నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మంత్రి ఎన్ఎండి ఫరూక్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12:30 నుండి 2:00 గంటల వరకు భక్తులకు అన్నప్రసాదం అందించనున్నట్టు ఆలయ కమిటీ తెలియజేసింది.
వాటర్ ట్యాంక్ మరియు తాగునీటి సౌకర్యం భక్తుల తాగునీటి అవసరాల కోసం నిర్మించిన నూతన వాటర్ ట్యాంక్ మరియు తాగునీటి సరఫరా వ్యవస్థను ఆయన ప్రారంభించారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు ఆలయ ప్రాంగణంలో బస చేయడానికి వీలుగా నిర్మించనున్న 5 వసతి గృహాలను మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. మత సామరస్యాన్ని, భక్తి భావాన్ని పెంపొందించడంలో దేవస్థానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా వసతి గృహాల నిర్మాణానికి, నిరంతర అన్నదాన కార్యక్రమానికి భక్తులు మరియు దాతలు ముందుకు వచ్చి తమవంతు సహకారం అందించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, చలం బాబు , పూజారి ప్రవీణ్, అన్నదాన సమితిసభ్యులు కృష్ణారెడ్డి, యుగంధర్ రెడ్డి, నాగరాజు, శివారెడ్డి, రామకృష్ణారెడ్డి, రామశివాడ్డి , శ్రీనివాస్ రెడ్డి, శైలు, ఆచారి, మద్దిలేటి, నాగరాజు, రమణ, నర్సింహులు, సుధాకర్, లక్ష్మీనారాయణ రెడ్డి,



నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, కొమ్ము హరి, చింతకుంట్ల విశ్వం మరియు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మరియు పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నష్టపోయిన మొక్కజొన్న రైతులకు పరిహారం ఇవ్వాలి.!

**రైతుల కష్టనష్టాలు పట్టించుకోని పాలకులు.**
**మండలాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.**
**క్వింటా రూ. 2.400 ప్రకారం పంటను ప్రభుత్వమే కొనాలి.**







**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 22:**
వర్షాల వల్ల నష్టపోయిన మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి. రామచంద్రుడు పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం బసాపురం గ్రామంలో రైతుల తెలుగు గంగా కట్టమీద ఆరబోసిన మొక్కజొన్న పంటను, పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ...120 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేసి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు.ఒక్కొక్క ఎకరాకు రూ.30,000 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే,వర్షాల వల్ల 30 కింటాలు రావాల్సిన దిగుబడి 15 కింటాలు లోపు మాత్రమే వచ్చిందన్నారు. కోసిన మొక్కజొన్న పంటను తెలుగు గంగా కట్టవెంట మూడు కిలోమీటర్ల వరకు ఆరబెట్టుకుంటే అధిక వర్షం వల్ల, పంట రంగు మారుతుందని, మొలకలు వస్తున్నాయన్నారు. టార్పాలిన్ పట్టాలు కప్పడం, తీయడంలో పంటంతా తడిసి నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవడానికి ముందుకు రావాలని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలని,మద్దతు ధర అమలు చేయాలని రైతులు తమ గోడు విన్నవించుకున్నారన్నారు.మండలంలో బసవపురం గ్రామంతో పాటు జిల్లాలో వ్యాప్తంగా శ్రీశైలం, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, బనగానపల్లె నియోజవర్గాల్లో అత్యధికంగా రూ.1, లక్ష57, వేలఎకరాలు సాగుచేసిన రైతులందరూ అధిక వర్షం వల్ల మద్దతు ధరలు, జాడ లేని పంట కొనుగోలు కేంద్రాలు వల్ల తీవ్రంగా రైతాంగం నష్టపోతున్నారన్నారు. ఓట్లేసి గెలిపించుకున్న పాపానికి తాము ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్న కనీసం పలకరింపు కైనా ప్రజాప్రతినిధులు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లాలోని ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి నంద్యాల మొక్కజొన్న రైతుల సమస్యలను తీసుకువెళ్లి అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన ప్రతి రైతు కుటుంబానికి ఎకరాకు రూ. 40,000 వేలు నష్టపరిహారం ఇప్పించాలని, తక్షణమే ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలని కోరారు. కేంద్ర, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.2,400 తక్షణం అమలు చేసి ప్రతి రైతు వద్ద ఉన్న మొత్తం పంటను మద్దతు ద్వారా ప్రకారం కొనుగోలు చేసి, మధ్య దళారుల దోపిడీ నుండి ఆదుకోవాలని కోరారు. రైతాంగం ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని దళారులు క్వింటాలు కేవలం రూ.1,600 రూ.1,700 లకు కొనుగోలు చేస్తూ, తూకాల్లో ఒక్కొక్క బస్తా పై ఐదు కేజీల వరకు తరుగుగా తీసుకుంటూ దోపిడీ చేస్తున్న పాలకులు మాత్రం పట్టినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు.ఇప్పటికైనా పాలకులు స్పందించి, మొక్కజొన్న రైతుల కష్టాలు నష్టాలు తెలుసుకోని వారికి మేమున్నాము అని ధైర్యం కల్పించాలన్నారు. పంటలను మద్దతు ధరకు అమ్మించి వారిని ఆదుకోండి అని కోరారు.గురువారం ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పంట కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధరలు, నష్టపరిహారం సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో రాజకీయాలకతీతంగా రైతులందరూ పాల్గొని తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు హుస్సేన్ భాష, జ్యోతుల మునియన్న, అక్బర్, సుభాన్, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# “మీ డబ్బు – మీ హక్కు” పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 22:**
“మీ డబ్బు %-% మీ హక్కు” అనే నినాదంతో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలలపాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో “మీ డబ్బు %-% మీ హక్కు” అనే గోడ పత్రికను విడుదల చేశారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి. నరసింహారావు, ఎల్డీఎం రవీంద్ర కుమార్, యూనియన్ బ్యాంక్ నూనెపల్లే బ్రాంచ్ మేనేజర్ మల్లికార్జున, డిఇఓ, కేజీబీవీ ప్రిన్సిపల్ తదితరులు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.
జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పౌరులు తమ పేర్లపై ఉన్న క్లెయిమ్ చేయని లేదా మరచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం కల్పించబడుతోందన్నారు. ప్రజలు బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా పాలసీలు మరియు ఇతర ఆర్థిక సాధనాలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా తమ కుటుంబ భవిష్యత్తును సురక్షితం చేసుకుంటున్నారని, అయితే కొన్ని సందర్భాల్లో ఈ ఆస్తులు పరిపక్వతకు వచ్చిన తర్వాత లబ్ధిదారులకు చేరకపోవడానికి



ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు, లేదా నామినీ వివరాల లోపం వంటి కారణాలు ఉన్నాయని చెప్పారు. ఆర్థిక సంస్థలు సాధ్యమైనంత వరకు లబ్ధిదారులు లేదా వారి చట్టపరమైన వారసులను సంప్రదించి ప్రయోజనాలు అందించడానికి కృషి చేస్తున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో అది సాధ్యం కావడం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కారణంగా పెద్ద మొత్తంలో నిధులు బ్యాంకులు, బీమా సంస్థలు మరియు ఇతర ఆర్థిక సంస్థల్లో క్లెయిమ్ చేయని రూపంలో నిల్వగా మిగిలిపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో, భారత ప్రభుత్వం సమన్వయంతో ఐదు ప్రధాన ఆర్థిక సంస్థలు ూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా, ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా , పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ, మరియు ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ కలిసి మూడు నెలల ప్రచారాన్ని ప్రారంభించాయని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రచారం ద్వారా పౌరులు తమ పేర్లపై ఉన్న క్లెయిమ్ చేయని నిధులను గుర్తించి, సరైన పత్రాలతో సులభంగా క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పించబడుతుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం కూడా ఈ ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేయబడిందని వివరించారు. “తమ ఆర్థిక హక్కులను వినియోగించుకోండి. క్లెయిమ్ చేయని నిధులను ఇప్పుడే క్లెయిమ్ చేసుకొని, మరచిపోయిన ఆర్థిక ఆస్తులను కొత్త అవకాశాలుగా మార్చుకోండి.” అని కలెక్టర్ సూచించారు.అనంతరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు మహిళల అభివృద్ధి కోసం నంద్యాల జిల్లాలోని 27 కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలలకు ఒక్కొక్క పాఠశాలకు ఒకటి చొప్పున మొత్తం 27 కంప్యూటర్లు అందజేశారు.

# వాయుగుండం నేపథ్యంలో జిల్లాలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలి.

**వర్షాల కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టండి.**
**-జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు, అక్టోబర్ 22:** వాయుగుండం నేపథ్యంలో జిల్లాలో అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.
రిజర్వాయర్లు,చెరువులు, లోతట్టు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, నదీతీర ప్రాంతాలను పరిశీలించి, ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా, తగిన నివారణ చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వాగులు, వంకల వద్ద నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న చోట వాహన రాకపోకలు నిలిపివేసి, ప్రజలను సురక్షితమైన ప్రత్యామ్నాయ రహదారులపైకి మళ్లించాలని తెలిపారు. విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరుగకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం అయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన అధికారులు రైతులకు పంట నష్టం జరుగకుండా తగిన సలహాలు అందచేయాలని సూచించారు.జిల్లా కేంద్రంలో, ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యగా ప్రజలను తరలించేందుకు షెల్టర్ లను గుర్తించి, ఆహార పదార్థాలు అందించే విధంగా సిద్ధపడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# నెట్వర్క్ ఆసుపత్రులకు రూ. 250 కోట్లు విడుదల.

**త్వరలో మరో రూ.250 కోట్లు చెల్లించేందుకు చర్యలు.**

**వెంటనే ఆందోళన విరమించాలని యాజమాన్య సంఘాల వారికి ప్రభుత్వం విజ్ఞప్తి.**

**ఆంధ్ర ప్రగతి అమరావతి అక్టోబర్ 22:**
డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ అనుబంధ(నెట్వర్క్) ఆసుపత్రుల బకాయిల్లో రూ.250 కోట్లను ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసింది. నిధుల చెల్లింపులపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ తో చర్చించారు. అనంతరం చర్యల్లో భాగంగా నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. అలాగే త్వరలో మరో రూ.250 కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వైద్య సేవల్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్, ఇతర సంఘాల ప్రతినిధులను సౌరభ్ గౌర్ కోరారు. ఈ మేరకు బుధవారం తనని కలిసిన పలువురికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని వివరించారు.

# స్వాతంత్ర్య సమరయోధులు అష్ఫాకుల్లా ఖాన్సేవలు చిరస్మరణీయం.

**సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ.**

**ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 22:**
డోన్ పట్టణంలో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆద్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు మన భరతమాత స్వేచ్ఛ కోసం సర్దార్ భగత్సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల కంటే నాలుగు సంవత్సరాల ముందే ఉరిశిక్షపడిన దేశభక్తుడు అష్ఫాఖుల్లా ఖాన్ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళ్ళు అర్పించారు.వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్దించాలి.

## -సిపిఐ పార్టీ, నంద్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి రంగనాయుడు.






**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె అక్టోబర్ 22:** ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్దించాలని నంద్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి రంగనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బుధవారం నాడు స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ఎదుట సిపిఐ పార్టీ, మండల కార్యదర్శి శివయ్య , ఏఐఎస్ఎఫ్ , ఏఐటియుసి , రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, నంద్యాల జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి సుంకయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలను సంబంధించిన అమౌంట్ 2700 కోట్ల రూపాయలు బకాయిలను (ప్రవేట్ ఆసుపత్రులకు ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలు సంబంధించిన ) చెల్లించడం లో విఫలం అయింది. దీంతో అక్టోబర్ 10 నుంచి ప్రైవేట్ ఆస్పత్రులు ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలను నిలుపుదల చేయడం జరిగింది. అక్టోబర్ 10 నుంచి అనారోగ్యానికి గురైన నిరుపేదలు , కార్మికులు , గ్రామీణ ప్రాంతానికి చెందిన పేదలు ప్రైవేట్ ఆస్పత్రిలో, నగదు చెల్లించి చికిత్సలు , వైద్యం పొందలేక అవస్థలు పడుతున్నారు. మోడీ జీఎస్టీ సూపర్ సభకు రాష్ట్ర ప్రభుత్వం 500 కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేసే బదులు ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలకు చెల్లించినట్లయితే ప్రయోజనం కలిగేదన్నారు. ప్రాథమిక హక్కుల్లో విద్య వైద్యం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించాలన్నారు. ఆనాడు మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన ఆరోగ్య సేవ పథకం అమలు పరచడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫ్లమైందన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించి ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలో సేవలను పునరుద్దించుకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు భార్గవ్, జిల్లా సమితి సభ్యులు సంజీవులు, సుబ్బారెడ్డి, , నంద్యాల జిల్లా ఏఐటియుసి కార్యదర్శి శివ బాలకృష్ణ,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రి స్వామి, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి చందు, పట్టణ ఏఐటియుసి కార్యదర్శి కుళాయి స్వామి, రైతు సంఘం జిల్లా నాయకులు పుల్లయ్య, సూర్యనారాయణ, వినయ్, హనుమంతు, పెద్దయ్య, చంటి, కంభగిరి, నాగరాజు, లక్ష్మీనారాయణ, నరేష్, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సృష్టి ఫెర్టిలిటీ కేసులో స్పీడ్ పెంచిన ఈడీ

హైదరాబాద్ **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో ఒక్కసారిగా సంచలనం రేకెత్తించిన సృష్టి ఫెర్టిలిటీ కేసుల్లో ఈడీ అధికారులు స్పీడ్ పెంచారు. ఇప్పటికే చంచల్‌గూడ మహిళా జైల్లో రిమాండ్‌లో ఉన్న నిందితులు డాక్టర్ నమ్రత, కల్యాణి, సంతోష్, నందినిని ఈడీ అధికారులు విచారిస్తున్నారు. అలాగేఈ కేసులో ప్రధాన నిందితుడు డాక్టర్ నమ్రత కుమారుడు జయంత్‌కృష్ణను సైతం ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. గతంలో సృష్టి ఫెర్టిలిటీకి సంబంధించిన వ్యవహారంలో మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. రాజస్థాన్‌కు చెందిన దంపతులు సికింద్రాబాద్ నార్త్ జోన్‌లోని గోపాలపురం పోలీసులను ఆశ్రయించి.. సృష్టి ఫెర్టిలిటీ ఆసుపత్రి వైద్యురాలి డాక్టర్ నమత్రపై




ఫిర్యాదు చేశారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు సృష్టి ఫెర్టిలిటీ ఆసుపత్రి చేస్తున్న మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. వారి వద్ద నుంచి రూ. 20 నుంచి 40 లక్షల వరకు నగదును డాక్టర్ నమత్రా వసూలు చేసినట్లు గుర్తించారు. ఇక అబార్షన్ కోసం వచ్చే మహిళలకు నగదు ఆశ చూపి.. వారి వద్ద నుంచి సైతం పిల్లలను కొనుగోలు చేసినట్లు సమాచారం. మొత్తం 86 మంది పిల్లలను విక్రయించడం ద్వారా.. రూ. 50 కోట్ల నగదు డాక్టర్ నమత్రా సంపాదించినట్లు తెలుస్తుంది. ఈ మొత్తం నగదును హోవాలా రూపంలో సేకరించింది. వీటితో భారీగా ఆస్తులు కొనుగోలు చేయడమే కాకుండా.. విదేశాలకు సైతం పెద్ద ఎత్తున హవాలా రూపంలో నగదు పంపినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఆ క్రమంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు వ్యవహారం బహిర్గమైంది. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ సోదాల్లో భాగంగా హైదరాబాద్‌లో ఐదు చోట్ల, విజయవాడ, విశాఖపట్నంలో రెండు చోట్ల సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు బ్యాంక్ అకౌంట్లతో పాటు సృష్టి రికార్డులను సైతం స్వాధీనం చేసుకున్నారు. పిల్లలు లేని జంటలను లక్ష్యంగా చేసుకుని డాక్టర్ నమత్రా వ్యవహారాలు నడిపినట్లు ఈడీ అధికారులు గుర్తించారు.

# అర మార్కు తక్కువొచ్చినా పాసే!

**ఏపీ ఇంటర్ విద్యార్థులకు గుడ్ న్యూస్..**

**ఇంటర్ సైన్స్ విద్యార్థులకు పాస్ మార్కుల్లో అర మార్కు సడలింపు**

**అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**

ఏపీలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యా మండలి శుభవార్త అందించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో పరీక్షా విధానంలో పలు కీలక సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రాక్టికల్స్ ఉన్న సైన్స్ సబ్జెక్టుల రాత పరీక్షల్లో అర మార్కు సడలింపు ఇస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల విద్యార్థులు అర మార్కు తేడాతో ఫెయిల్ అయ్యే ఆందోళన తొలగిపోనుంది.




**పాస్ మార్కుల్లో కొత్త విధానం ఇదే..**

ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ వంటి సబ్జెక్టులకు ఈ మార్పు వర్తిస్తుంది. గతంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల రాత పరీక్షల్లో కలిపి ఉత్తీర్ణత సాధించాలంటే కనీసం 59.50 మార్కులు అవసరం కాగా, ఇప్పుడు దాన్ని 59 మార్కులకు తగ్గించారు. అంటే, అర మార్కు తక్కువ వచ్చినా విద్యార్థులను పాసైనట్లుగానే పరిగణిస్తారు. ఈ అర మార్కును సెకండ్ ఇయర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో సర్దుబాటు చేయనున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. దీని ప్రకారం ప్రాక్టికల్స్‌లో పాస్ మార్కును 10.5 నుంచి 11 మార్కులకు పెంచారు.

**పరీక్షా విధానంలో మరిన్ని సంస్కరణలు**

ఈ సంస్కరణల్లో భాగంగా మొదటి సంవత్సరం పరీక్షల్లో కొత్తగా ఒక మార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టారు. అయితే, ఒక మార్కు, రెండు మార్కుల ప్రశ్నలకు ఎలాంటి ఛాయిస్ ఉండదని స్పష్టం చేశారు. అలాగే, ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న వృక్షశాస్త్రం (బోటనీ), జంతుశాస్త్రం (జువాలజీ) పేపర్లను కలిపి ఒకే జీవశాస్త్రం (బయోలజీ) పేపర్‌గా మార్చారు. ఈ పరీక్షలో వృక్షశాస్త్రం నుంచి 43, జంతుశాస్త్రం నుంచి 42 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి.

ఇదిలా ఉండగా, కొన్ని పాత నిబంధనలను యథాతథంగా కొనసాగిస్తున్నారు. ఏదైనా ఒక సబ్జెక్టులో ఎక్కువ మార్కులు సాధించి, మిగతా సబ్జెక్టుల్లో 30 శాతం మార్కులు తెచ్చుకున్నా ఉత్తీర్ణులుగా పరిగణించే విధానం కొనసాగుతుంది. ఇక, జాగ్రఫీ సబ్జెక్టు సిలబస్‌లో ఎలాంటి మార్పులు చేయలేదని, పాత విధానంలోనే పరీక్షలు నిర్వహిస్తామని బోర్డు తెలియజేసింది. అదనంగా గ్రూపులో ఆరో సబ్జెక్టుగా ఎంచుకున్న సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి కాదని, దానికి ప్రత్యేక మెమో జారీ చేస్తామని పేర్కొంది.

# రూపాయి బలోపేతానికి ఆర్‌బీఐ చర్యలు

న్యూఢిల్లీ **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**

అమెరికా కఠిన నిర్ణయాలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న భారత రూపాయికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాఅండగా నిలిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత దిగజారకుండా నిరోధించేందుకు భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు నెలలో ఏకంగా 7.69 బిలియన్ అమెరికన్ డాలర్లను (సుమారుగా రూ.67 వేల కోట్లు) మార్కెట్లో విక్రయించినట్లు ఆర్బీఐ తన తాజా బులెటిన్‌లో వెల్లడించింది. ఇటీవల డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 88కి పడిపోయింది. ఆగస్టు నెలలో రూపాయి విలువ 1.6 శాతం వరకు క్షీణించడంతో కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. సాధారణంగా మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరిగినప్పుడు రూపాయి బలహీనపడుతుంది. అలాంటప్పుడు ఆర్బీఐ తన విదేశీమారక నిల్వల నుంచి డాలర్లను అమ్ముతుంది. దాంతో మార్కెట్లో డాలర్ల సరఫరా పెరిగి, రూపాయి విలువ స్థిరపడుతుంది. జూలై నెలతో పోలిస్తే ఆగస్టులో ఆర్బీఐ విక్రయించిన డాలర్లు ఏకంగా మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. మార్కెట్లో తీవ్రమైన అనిశ్చితి ఉన్నప్పుడు మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఒకవైపు డాలర్లను విక్రయిస్తూనే మరోవైపు ఆర్బీఐ వ్యూహాత్మకంగా బంగారం నిల్వలను పెంచుకుంటోంది. రెండు నెలల విరామం తర్వాత సెప్టెంబర్‌లో కొత్తగా 200 కిలోల పసిడిని కొనుగోలు చేసింది.దాంతో ఆర్బీఐ దగ్గరున్న మొత్తం బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. వాటి




విలువ సుమారు రూ. 8.36 లక్షల కోట్లుగా ఉంది. ఏ దేశ కేంద్ర బ్యాంకు వద్దనైనా బంగారం నిల్వలు ఎక్కువగా ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ, కరెన్సీపై అంతర్జాతీయంగా నమ్మకం పెరుగుతుంది. సంక్షోభ సమయాల్లో బంగారం సురక్షితమైన ఆస్తిగా పనిచేస్తుంది. విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వంటి కరెన్సీలు ఉన్నప్పటికీ, బంగారం నిల్వలు ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇస్తాయి. అధిక బంగారం నిల్వలు దేశ రేటింగ్ మెరుగుపడటానికి కూడా దోహదపడతాయి. తద్వారా తక్కువ వడ్డీకే అంతర్జాతీయ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ చేపడుతున్న ద్వంద్వ వ్యూహం రూపాయిని బలోపేతం చేయడానికేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# వాయుగుండంపై ఏపీ సర్కారు అలర్ట్



అమరావతి **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి** బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం రాబోయే 12 గంటల్లోపు వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపు కదులుతూ ఆ తదుపరి 12 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో అతిభారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో హోం మంత్రి అనిత బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని సూచించారు. సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని.. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని అధికారులకు తెలియజేశారు. సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోంమంత్రి అనిత వినతి చేశారు.

# డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు ఫోన్లు మాట్లాడకండి

## - సమయం కలిసొస్తుందని రాంగ్ రూట్ లో వెళ్లకండి.

## సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.



పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త, డోన్.

**ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 22:** రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి పేర్కొన్నారు. వాహనదారులు సమయం కలిసొస్తుందని రాంగ్ రూట్ లో వెళ్లడం వల్ల మీతో పాటు మీ తోటి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. రాంగ్ రూట్ లో వెళ్లటం వల్ల ప్రమాదాలు జరుగుతాయి. కావున సమయం కలిసొస్తుందని రాంగ్ రూట్ లో వెళ్లకండి. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడకూడదని అందరికీ తెలుసు. అయితే దానిని పాటించడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్‌లు ఉపయోగించడం వల్ల సంభవించే రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు అధికమగుచున్నాయని కావున డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్‌లు ఉపయోగించకుండ రోడ్డు ప్రమాదాలను నివారించాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా నాణ్యమైన హెల్మెట్లు ధరించాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. నాణ్యమైన హెల్మెట్లు వినియోగిస్తే ప్రమాదం సంభవించినా ప్రాణహాని ఉండదన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకువాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని,హెల్మెట్ ధారణపై నిర్లక్ష్యం చెయోద్దని, మనపై ఆధారపడ్డ కుటంబ సభ్యుల బాధ్యత మన పై ఉన్నదని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. అనేక కారణాల వల్ల ఏటా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండడం చాలా బాధాకరమని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి అన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలని ప్రభుత్వం ద్వారా జాతీయ రహదారిపై ఉన్న అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఫస్ట్ రెస్పాండర్స్‌గా ఉండేందుకు హైవేలపై ఉన్న పెట్రోల్ బంకులు, దాబాల్లో పని చేసే వారికి, యువతకు, గ్రామస్థులకు ఫస్ట్ ఎయిడ్, సిపిఆర్‌పై అవగాహణ కలిగించాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

# పత్రికా కార్యాలయాలపై దాడులు దారుణం

## : అల్లం నారాయణ



హైదరాబాద్ **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో ఎప్పుడూ లేనంతగా వార్తా పత్రికల కార్యాలయాలపై భౌతిక దాడులకు ప్రయత్నించడం, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతిసాగర్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా నమస్తే తెలంగాణ ఎడిషన్ కార్యాలయంపైకి అధికార పార్టీకి చెందిన వందలాది కార్యకర్తలు వెళ్లి దాడికి ప్రయత్నించారని, అడ్డుకున్న సిబ్బందిని దుర్భాషలాడారని, తాము దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వార్తల విషయంలో బేధాభిప్రాయాలు ఉన్నప్పుడు న్యాయపరంగా, చట్టపరంగా ముందుకు వెళ్లాలి తప్ప ఈ రకమైన భౌతిక దాడులకు ప్రయత్నించడం ఎంత మాత్రం సమంజసం కాదని, బావ ప్రకటన స్వేచ్ఛకు ఇది గొడ్డలిపెట్టని వారు ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగం కల్పించిన మీడియా స్వేచ్ఛ హక్కును హరించే విధంగా రాజకీయ పార్టీలు వ్యవహరించదాన్ని వారు తప్పుపట్టారు. దాడికి పరోక్షంగా కారకులైన వారితోపాటు ప్రత్యక్షంగా పాల్గొన్న వారు ఎంతటి వారైనా వాళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రకమైన దాడులకు పూనుకుంటే జర్నలిస్టు సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. జర్నలిస్టు సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రజలకు వాస్తవాలను వివరిస్తాయని చెప్పారు.

# తుని గురుకుల పాఠశాలలో దారుణం

అమరావతి, **అక్టోబర్ 22 ఆంధ్ర ప్రగతి**

బాలికకు మాయమాటలు చెప్పి పాఠశాల నుంచి బయటకు తీసుకెళ్లి ఓ కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన తుని బాలికల గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎనిమిదో తరగతి చదువుతున్న మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి స్కూల్ నుంచి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితుడు.. ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. విషయం తెలిసిన బాలిక బంధువులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నారాయణరావు అనే వ్యక్తి.. తరచూ గురుకుల పాఠశాలకు వెళ్లి బాలిక బంధువును అని చెప్పి ఆమెను తీసుకెళ్లేవాడని తెలుస్తోంది. కూడా గురుకుల పాఠశాలకు వచ్చిన నారాయణ... బాలికను ఎవరూ లేని ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆపై బాలికపై అత్యాచారం చేసేందుకు యత్నించాడు. స్థానికులు గమనించి నిలదీయగా అక్కడి నుంచి పరారయ్యాడు నిందితుడు. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు గురుకుల పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని 13 జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. తూత్తుకుడి, తిరువారూర్ జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. నాగపట్నం, తిరువారూర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, బోట్లు, చెట్లను తొలగించే యంత్రాలతో పాటు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచారు.

# ఒలింపిక్ హీరో నీరజ్ చోప్రాకు సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ హోదా



భారత జావెలిన్ సంచలనం, రెండుసార్లు ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా ఖాతాలో మరో అరుదైన గౌరవం చేరింది. ఆయనకు భారత ప్రాదేశిక సైన్యంలో (టెరిటోరియల్ ఆర్మీ) గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాను ప్రదానం చేశారు. ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఈరోజు జరిగిన ఓ కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ లాంఛనాన్ని పూర్తి చేసి, నీరజ్ భుజంపై గౌరవ చిహ్నాలను అలంకరించారు.

ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. నీరజ్ చోప్రా పట్టుదల, దేశభక్తి, నిబద్ధతకు నిలువుటద్దం వంటి వారని కొనియాడారు. క్రీడారంగంలో ఆయన సాధించిన అద్భుత విజయాలు దేశానికి గర్వకారణమని, ఆయన క్రీడాకారులకు, సైనిక దళాలకు ఒకేలా స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఇతర ఉన్నతాధికారులు, నీరజ్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

నీరజ్ చోప్రా 2016 ఆగస్టు 26న రాజ్‌పుతానా రైఫిల్స్‌లో నాయబ్ సుబేదార్‌గా భారత సైన్యంలో చేరారు. అప్పటి నుంచి క్రీడల్లో రాణిస్తూనే దేశానికి సేవ చేస్తున్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించిన ఆయన, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతం గెలుచుకున్నారు. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లోనూ ఆయన స్వర్ణ పతకాలు సాధించారు.దేశానికి ఆయన అందించిన సేవలు, క్రీడల్లో సాధించిన విజయాలకు గుర్తింపుగా.. నీరజ్ చోప్రాకు ఈ గౌరవ హోదాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ ఏడాది ఏప్రిల్ 16నే ఆమోదించారు. దీనికి సంబంధించిన అధికారిక కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. నీరజ్ చోప్రా ఇప్పటికే పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, అర్జున అవార్డులతో పాటు పరమ విశిష్ట సేవా పతకం, విశిష్ట సేవా పతకం వంటి సైనిక పురస్కారాలను కూడా అందుకున్నారు.








# కఠిన సవాల్

నవీ ముంబై: ప్రపంచ కప్‌లో ఇప్పటికే హ్యాట్రిక్ పరాజయాలతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న భారత మహిళల జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. గురువారం జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో హర్మన్‌ప్రీత్ సేన అమీతుమీ తేల్చుకోనుంది. .ఈ మ్యాచ్ గెలిస్తే మన మహిళలకు సెమీఫైనల్ అవకాశాలు సులువు అవుతాయి. ఒక వేళ ఓడితే సమీకరణాలపై ఆధారపడాల్సివుంటుంది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ టాప్-3లో నిలిచి ఇప్పటికే సెమీస్ బెర్త్‌లను ఖరారు చేసుకోగా.. మిగిలిన ఏకైక స్థానం కోసం భారత్, న్యూజిలాండ్ పోటీపడుతున్నాయి. ఇప్పుడు ఇరుజట్లకు చెరి రెండు మ్యాచ్‌లు మిగిలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒకదాంట్లో ఇద్దరూ ముఖాముఖికి సిద్ధమవడంతో తాజా పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే, భారత్ తన తర్వాతి, ఆఖరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించినా సెమీస్ చేరుతుంది. మరోవైపు సోఫీ డివైన్ సారథ్యంలోని కివీస్ జట్టు తమ చివరి పోరులో ఇంగ్లండ్‌ను ఓడించాల్సి ఉంటుంది. సోఫీతో పాటు సుజీ బేట్స్‌లాంటి స్టార్ బ్యాటర్లున్న ఆ జట్టు ఇప్పుడు భారత్ పోరుతో తమ అవకాశాలను మెరుగుపరుచుకోవాలనుకుంటోంది. గత మూడు మ్యాచుల్లోనూ హర్మన్ సేన గెలుపు ముంగిట బోల్తా పడడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఆఖర్లో తీవ్ర ఒత్తిడిని తట్టుకోలేక చేజేతులా ఓటమిపాలైంది. అయితే స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ ఫామ్‌లోకి రావడం శుభపరిణామం. రిచా ఘోష్, దీప్తి శర్మ, అమన్‌జోత్ మెరుగ్గానే రాణిస్తున్నారు. కానీ.. ప్రతీకా రావల్, హర్లీన్ రాణించాలి. బౌలర్లలో క్రాంతి గౌడ, శ్రీచరణి, దీప్తి, స్నేహ్ రాణా ఫర్వాలేదనిపిస్తున్నారు. అయితే, గతమ్యాచ్‌లో అదనపు బౌలర్ కోసమని బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్‌పై వేటు వేసి రేణుకా సింగ్‌ను జట్టులోకి తీసుకున్నారు. కానీ, రేణుక అంతగా ప్రభావం చూపలేకపోయింది. మరి, కివీస్‌తో పోరుకు ఇదే కాంబినేషన్‌ను కొనసాగిస్తారా? లేదంటే ఎక్స్‌ట్రా బ్యాటర్‌గా జెమీమాకు అవకాశమిస్తారో.. చూడాలి.



# శాఫ్ క్రీడలకు వెంకట్రామ్ మోహిత్

దక్షిణాసియా అథ్లెటిక్స్ ఫెడరేషన్ (శాఫ్) పోటీల్లో తెలుగు క్రీడాకారులు వెంకట్రామ్ రెడ్డి (కర్నూలు), మోహిత్ చౌధురి (నాగర్‌కర్నూల్) భారత్ తరఫున బరిలోకి దిగుతున్నారు. గురువారం నుంచి రాంచీలో మూడ్రోజులపాటు జరిగే ఈ టోర్నీలో భారత్‌తో పాటు పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మాల్దీవులు, అఫ్ఘానిస్థాన్ దేశాలు పోటీ పడనున్నాయి. పురుషుల 800 మీటర్ల పరుగులో వెంకట్రామ్, 5 వేల మీటర్ల పరుగు పోటీకి మోహిత్ అర్హత సాధించారు. ఇక, బహ్రెయిన్‌లో బుధవారం నుంచి జరిగే ఆసియా యూత్ గేమ్స్‌లో యశ్విత (శ్రీకాకుళం) హైజంపలో భారత్ తరఫున పోటీ పడనుంది

# బుమ్రా టాప్..

## టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో బుమ్రా అగ్రస్థానం పదిలం

**వన్డేల్లోకి సిరాజ్ రీఎంట్రీ**

**రెండో స్థానానికి ఎగబాకిన పాక్ బౌలర్ నోమాన్ అలీ**

**బుమ్రా, నోమాన్ మధ్య 29 పాయింట్లకు తగ్గిన వ్యత్యాసం**

**వన్డే ర్యాంకుల్లోకి ఘనంగా పునరాగమనం చేసిన సిరాజ్**

**17వ స్థానంలో నిలిచిన భారత పేసర్ మహమ్మద్ సిరాజ్**






ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే, అతడికి పాకిస్థాన్ బౌలర్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. పాక్ స్పిన్నర్ నోమాన్ అలీ అద్భుత ప్రదర్శనతో రెండో స్థానానికి దూసుకురావడంతో బుమ్రా ఆధిక్యం కేవలం 29 పాయింట్లకు పడిపోయింది.దక్షిణాఫ్రికాతో లాహోర్‌లో జరిగిన టెస్టులో నోమాన్ అలీ 10 వికెట్ల ప్రదర్శనతో సత్తా చాటాడు. ఈ ప్రదర్శనతో అతను ఏకంగా నాలుగు స్థానాలు ఎగబాకి 853 రేటింగ్ పాయింట్లతో కెరీర్‌లోనే అత్యుత్తమ రెండో ర్యాంకును అందుకున్నాడు. ఇదే మ్యాచ్‌లో రాణించిన మరో పాక్ పేసర్ షాహీన్ అఫ్రిది మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 19వ ర్యాంకులో నిలిచాడు. టెస్ట్ బ్యాటింగ్ చార్టులో మాత్రం ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ తన అగ్రస్థానాన్ని కాపాడుకున్నాడు.

వన్డే ర్యాంకుల్లోకి సిరాజ్

మరోవైపు భారత ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ వన్డే ర్యాంకింగ్స్‌లోకి ఘనంగా పునరాగమనం చేశాడు. ఏడాది తర్వాత వన్డే ఆడిన సిరాజ్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లో మంచి ప్రదర్శన కనబరిచి నేరుగా 17వ స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన మిచెల్ మార్ష్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 42వ స్థానానికి చేరాడు. ఆసీస్ బౌలర్లు జోష్ హేజిల్‌వుడ్ 10వ, మిచెల్ స్టార్క్ 21వ ర్యాంకు సాధించారు.

# వర్షం అంతరాయాలే కారణం

## సీనియర్ల వైఫల్యంపై స్పందించిన బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్

ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ విఫలం కావడంపై తీవ్ర చర్చ నడుస్తోంది. చాలా కాలం తర్వాత వన్డే జట్టులోకి వచ్చిన వారిద్దరి సన్నద్ధతపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్న తరుణంలో భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పందించాడు. వారి వైఫల్యానికి ప్రాక్టీస్ లేకపోవడం కారణం కాదని, ప్రతికూల వాతావరణమే వారి ఆటను దెబ్బతీసిందని స్పష్టం చేశాడు.బుధవారం మీడియాతో మాట్లాడిన కోటక్, మ్యాచ్‌కు పదేపదే వర్షం అడ్డుపడటంతో బ్యాటర్ల ఏకాగ్రత దెబ్బతిన్నదని తెలిపాడు. "రోహిత్, కోహ్లీ ఇద్దరూ ఎంతో అనుభవజ్ఞులు. తొలి వన్డేలో వారి ప్రదర్శనపై వాతావరణం తీవ్ర ప్రభావం చూపింది. ప్రతి రెండు ఓవర్లకు ఒకసారి డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లి మళ్లీ మైదానంలోకి రావడం ఏ బ్యాట్స్‌మెన్‌కైనా చాలా కష్టం. అదే సమయంలో ఆస్ట్రేలియా మొదట బ్యాటింగ్ చేసి ఉన్నా, వాళ్లు కూడా ఇలాగే ఇబ్బంది పడేవారు" అని ఆయన వివరించాడు.

ఆటగాళ్ల సన్నద్ధతపై వస్తున్న విమర్శలను కోటక్ తోసిపుచ్చాడు. "ఆస్ట్రేలియా పర్యటనకు రాకముందే వారిద్దరూ సరైన శిక్షణ తీసుకున్నారు. టెస్ట్ క్రికెట్‌కు రిటైరైనా, వారు ఐపీఎల్‌లో నిరంతరం ఆడుతూనే ఉన్నారు. వారి ఫిట్‌నెస్, ప్రాక్టీస్ గురించి మాకు పూర్తి అవగాహన ఉంది. వారు జాతీయ క్రికెట్ అకాడమీలో కూడా శిక్షణ పొందుతారు. అంత సీనియర్ ఆటగాళ్ల విషయంలో అనవసరంగా జోక్యం చేసుకోవడం సరైంది కాదు. వారిని ఒక మ్యాచ్ ఆధారంగా అంచనా




వేయడం తొందరపాటు అవుతుంది" అని కోటక్ అభిప్రాయపడ్డాడు.

ఛాంపియన్స్ ట్రోఫీ 2025 తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేసిన రోహిత్, కోహ్లీకి ఆస్ట్రేలియాతో తొలి వన్డే కలిసిరాలేదు. జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో రోహిత్ శర్మ 8 పరుగులకే ఔట్ కాగా, మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో విరాట్ కోహ్లీ డకౌట్ అయ్యాడు. ఆస్ట్రేలియా గడ్డపై వన్డేల్లో కోహ్లీ డకౌట్ కావడం ఇదే తొలిసారి. వర్షం కారణంగా 26 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత్ 7 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది.

# మెక్సికోలో ఫుట్‌బాల్ జాతర..

## ప్రాణభయంతో సంపన్న పర్యాటకులు!

2026 ఫీఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు అమెరికా, కెనడాతో కలిసి మెక్సికో ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే, ఈ మెగా టోర్నమెంట్ కోసం ఫుట్‌బాల్ అభిమానులు సిద్ధమవుతుంటే, మెక్సికోలోని భద్రతా సంస్థలు మాత్రం సంపన్న పర్యాటకులకు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, సాయుధ రక్షణ సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. దేశంలో పేట్రేగిపోతున్న డ్రగ్ మాఫియా, నేరాల కారణంగా ఈ ప్రత్యేక సేవలకు భారీ డిమాండ్ ఏర్పడింది.మెక్సికోలో ఏటా సుమారు 30,000 హత్యలు జరుగుతుండటంతో పర్యాటకులు, ముఖ్యంగా డబ్బున్నవారు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ భయాన్ని అవకాశంగా మలుచుకున్న సెక్యూరిటీ సంస్థలు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. కేవలం బుల్లెట్‌ప్రూఫ్ కార్లే కాకుండా, బాంబుల నుంచి రక్షణ, సాయుధ అంగరక్షకులు, బుల్లెట్‌ప్రూఫ్ దుస్తులు వంటి సేవలను కూడా అందిస్తున్నాయి."మా దగ్గర డబ్బున్న పర్యాటకుల నుంచే బుకింగ్స్ వస్తున్నాయి. మెక్సికో గురించి చెడుగా వినడంతో వాళ్లు భయపడుతున్నారు" అని రుహే అనే సెక్యూరిటీ సంస్థ అధిపతి లియోపోల్డో సెర్డీరా తెలిపారు. వరల్డ్ కప్ కోసం ఆయన తన సంస్థలోని 70 బుల్లెట్‌ప్రూఫ్ వాహనాల సంఖ్యను 80కి పెంచాలని యోచిస్తున్నారు.

మెక్సికో సిటీ, మాంటెర్రీ, గ్వాడలజారా నగరాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరగనున్నాయి. వీటిలో గ్వాడలజారా నగరం అత్యంత ప్రమాదకరమైన 'జలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్' (సీజేఎన్‌జీ)కు అడ్డాగా ఉంది. ఈ ముఠాను అమెరికా ఉగ్రవాద సంస్థగా ప్రకటించి, దాని నాయకుడిపై 12 మిలియన్ డాలర్ల రివార్డు కూడా




ప్రకటించింది. దీంతో అధికారులు ఆ నగరాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే రాజధానిలో 40,000 అదనపు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, మ్యాచ్‌లు జరిగే నగరాల్లో డ్రోన్ల వినియోగంపై ఆంక్షలు విధించారు.

ఈ సెక్యూరిటీ వాహనాలకు రోజుకు 800 నుంచి 1,100 డాలర్ల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. డ్రైవర్, అంగరక్షకుల సేవలకు అదనపు ఛార్జీలు ఉంటాయి. మరోవైపు, డ్రగ్ మాఫియాలు కూడా 'మాన్‌స్టర్స్'గా పిలిచే సొంత బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను తయారు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా, అధిక జీతాలు ఆశ చూపి సెక్యూరిటీ సంస్థల్లోని సిబ్బందినే తమ ముఠాల్లోకి చేర్చుకోవడం ఆందోళన కలిగిస్తోంది.అయితే, ఈ డ్రగ్ ముఠాలు వరల్డ్ కప్‌కు నేరుగా ఎలాంటి ముప్పు కలిగించకపోవచ్చని భద్రతా సలహాదారు డేవిడ్ సౌసెడో అభిప్రాయపడ్డారు. '


ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# మోస్ట్ వాంటెడ్ సైనికుడు..

## ఆసక్తికరంగా ప్రభాస్ కొత్త సినిమా పోస్టర్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన అభిమానులకు పుట్టినరోజు కానుక ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం టైటిల్‌ను రేపు ప్రకటించనున్నట్లు చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేసి అంచనాలను పెంచింది. ప్రస్తుతం 'రాజాసాబ్' చిత్రంతో బిజీగా ఉన్న ప్రభాస్, ఆ తర్వాత 'సీతారామం' ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించి విడుదల చేసిన పోస్టర్‌లో సైనికుడి దుస్తుల్లో ఉన్న ప్రభాస్ కాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. 'ఒక సైనికుడు ఒంటరిగా కవాతు చేస్తాడు' (%ూా రాశీశ్రీనఱవతీ మీుతీఎష్ట్రవం ూాశ్రీశీఅవ%), '1932 నుంచి మోస్ట్ వాంటెడ్' (%వీశీర్ ఔుత్వస ూఅఅఎవ% 1932) వంటి క్యాప్షన్లు సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతున్నాయి. ఈ సినిమా టైటిల్‌ను ప్రభాస్ పుట్టినరోజైన





అక్టోబర్ 23న ఉదయం 11:07 గంటలకు వెల్లడించనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ సినిమా రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో సాగే ఒక పీరియాడిక్ ప్రేమకథగా ప్రచారం జరుగుతోంది. అయితే, తాజా పోస్టర్‌లోని క్యాప్షన్లను బట్టి ఇందులో స్పై థ్రిల్లర్ అంశాలు కూడా ఉండొచ్చని అభిమానులు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రభాస్ పాత్రపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన కొత్త నటి ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సమాచారం.

'సీతారామం' వంటి క్లాసిక్ ప్రేమకథతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన హను రాఘవపూడి, ప్రభాస్‌తో సినిమా చేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

# 'డ్యూడ్'కు ఇళయరాజా షాక్..

## మరోసారి లీగల్ చిక్కుల్లో మైత్రీ!




ఒకవైపు కలెక్షన్ల వర్షం, మరోవైపు కాపీరైట్ వివాదం.. ప్రస్తుతం టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ పరిస్థితి ఇది. వారు నిర్మించిన లేటెస్ట్ చిత్రం 'డ్యూడ్', దీపావళి కానుకగా విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ టాక్‌తో దూసుకుపోతోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 90 కోట్లకు పైగా గ్రాస్‌తో వంద కోట్ల క్లబ్ వైపు పరుగులు తీస్తున్న ఈ సినిమాకు, ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. లెజెండరీ మ్యూజిక్ కంపోజర్ ఇళయరాజా, 'డ్యూడ్' సినిమా మేకర్స్‌పై అధికారికంగా ఫిర్యాదు చేశారు. తన అనుమతి లేకుండా, తన పాపులర్ సాంగ్ "కరుత మచ్చాన్"ను సినిమాలో ఉపయోగించుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ వార్త ఇప్పుడు కోలీవుడ్, టాలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న టైమ్‌లో ఈ వివాదం తెరపైకి రావడం గమనార్హం. నిజానికి, మైత్రీ మూవీ మేకర్స్‌కు, ఇళయరాజాకు మధ్య ఇలాంటి వివాదం తలెత్తడం ఇది మొదటిసారి కాదు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే, అజిత్ హీరోగా వారు నిర్మించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా విషయంలో ఇళయరాజా లీగల్ నోటీసులు పంపారు. ఆ సినిమాలో తన అనుమతి లేకుండా మూడు పాటలను ("ఒత్త రూబా తారెన్", "ఇళమై ఇదో ఇదో", "ఎన్ జోడి మంజ కురువి") వాడటమే కాకుండా, వాటిని మార్చారని ఆయన ఆరోపించారు. కాపీరైట్ ఉల్లంఘన కింద 5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని, పాటలను సినిమా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో మైత్రీ మూవీ మేకర్స్ స్పందిస్తూ, తాము ఆ పాటల హక్కులను సోనీ మ్యూజిక్ వంటి సంస్థల నుంచి చట్టబద్ధంగా కొనుగోలు చేశామని, ఒక్కో పాటకు ?15-20 లక్షలు చెల్లించామని వివరణ ఇచ్చింది. అన్ని నిబంధనలను పాటించామని వారు తెలిపారు. ఈ కేసు ఇంకా కోర్టులో నడుస్తుండగానే, ఇప్పుడు 'డ్యూడ్' విషయంలో మరోసారి అదే తరహా వివాదం మొదలైంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కేసు ఇంకా తేలకముందే, 'డ్యూడ్' సినిమాలో తన పాటను అనుమతి లేకుండా వాడటంపై ఇళయరాజా తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ తాజా ఫిర్యాదుపై మైత్రీ మూవీ మేకర్స్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

# రిస్క్ చేయాలని డిసైడైన జాన్వీ కపూర్

ఎవరికైనా సక్సెస్, ఫెయిల్యూర్లు సహజం. అయితే సక్సెస్ ఎవరికైనా కిక్కిస్తే ఫెయిల్యూర్ మాత్రం చాలా డిజప్పాయింట్ చేస్తుంది. అయితే కొందరు మాత్రం ఫెయిల్యూర్ ను దృష్టిలో పెట్టుకుని, మళ్లీ అలాంటివి రాకుండా జాగ్రత్త పడితే, ఇంకొందరు మాత్రం ఫెయిల్యూర్ వచ్చినంత మాత్రాన దిగులు పడుతూ కూర్చుంటే ఎలా అని కెరీర్లో ముందుకెళ్తూ ఉంటారు. జాన్వీ కపూర్ ఇందులో ఆఖరి కోవలోకి వస్తుంది. అతిలోక సుందరి శ్రీదేవి కూతురిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన జాన్వీ, తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్ గా జాన్వీ నుంచి వచ్చిన పరమ్ సుందరి, సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి సినిమాలు బాక్సాఫీస్ వద్ద అనుకున్న ఫలితాల్ని అందుకోలేకపోయాయి. అయినప్పటికీ జాన్వీ కృంగి పోలేదు. యాక్షన్ సినిమాకు ఓకే చెప్పిన జాన్వీ ఆ సినిమాలు ఫ్లాప్ అయినా జాన్వీ మాత్రం తర్వాతి సినిమాను లైన్ లో పెట్టి అందరికీ షాకిచ్చింది. టైగర్ ష్రాఫ్, లక్ష్య ప్రధాన పాత్రల్లో కరణ్ జోహార్ నిర్మాణంలో ఓ కొత్త యాక్షన్ డ్రామాకు జాన్వీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే జాన్వీ ఈ సినిమా ఒప్పుకోవడానికి కారణం.. తాను కేవలం రొమాంటిక్ సినిమాలు మాత్రమే కాదు, ఏ జానర్ సినిమాలైనా చేయగలనని నిరూపించుకోవాలనుకోవడం. రాజ్ మెహతా దర్శకత్వంలో రానున్న ఈ సినిమా యాక్షన్, రివెంజ్, ఇంటెన్స్ డ్రామాతో రూపొందనుందని వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, ఈ మూవీలో జాన్వీకి చాలా స్ట్రాంగ్ రోల్ దక్కిందని, ఈ సినిమా ద్వారా తన ఎనర్జీ, ఎమోషన్, స్క్రీన్ ప్రెజెన్స్ ను మరింత బలంగా చూపించే అవకాశముందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఫ్యాన్స్ మాత్రం టైగర్ ష్రాఫ్, లక్ష్యతో జాన్వీ కెమిస్ట్రీ ఎలా ఉంటుందోనని డిస్కస్ చేసుకుంటున్నారు. రెండు ఫ్లాపుల తర్వాత జాన్వీ ఇలాంటి అడుగు వేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ఇలాంటి సినిమాలు ఎంచుకుని, ఫ్లాపులు తన కెరీర్ ను డిసైడ్ చేయలేవని జాన్వీ నిరూపించుకోవాలని చూస్తుంది. అంతేకాదు, నటిగా కూడా తనను ఛాలెంజ్ చేసే సినిమాలను ఎంచుకోవాలని డిసైడై, అలాంటి క్యారెక్టర్లపైనే జాన్వీ ఫోకస్ చేసి రిస్క్ చేయడానికి కూడా జాన్వీ రెడీ అయిందని బాలీవుడ్ మీడియా వర్గాలంటున్నాయి. ఈ సినిమా సక్సెస్ అయితే ఇప్పటివరకు ఉన్న జాన్వీ క్రేజ్ మరో లెవెల్ కు వెళ్లడం ఖాయం. ఎవరైనా వరుస ఫ్లాపులు వచ్చినప్పుడు సేఫ్ ప్రాజెక్టులను సెలెక్ట్ చేసుకుని హిట్ అందుకోవాలని చూస్తారని, కానీ జాన్వీ మాత్రం భిన్నంగా ఆలోచించి తన సత్తా ఏంటో చాటాలని కసిగా ఉందని, ఏ నటికైనా ఇలాంటి లక్షణమే ఉండాలని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు



# నాన్నలాగే కష్టపడి పేరు తెచ్చుకుంటా

## విక్రమ్ తనయుడు ధ్రువ్



తమిళంలో సంచలన విజయం సాధించిన 'బైసన్' చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో చిత్ర కథానాయకుడు ధ్రువ్ విక్రమ్ మాట్లాడుతూ సినిమా కోసం తాను పడిన కష్టాన్ని వివరించారు. ఈ పాత్ర కోసం సుమారు మూడేళ్లు కష్టపడ్డానని, కబడ్డీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నానని తెలిపారు. చిత్రీకరణ సమయంలో పలుమార్లు గాయపడినట్లు, ఎడమ చేయి విరగడంతో పాటు మూడు పళ్లు కూడా దెబ్బతిన్నాయని ఆయన చెప్పుకొచ్చారు.

"ఈ సినిమా కోసం హైదరాబాద్ ప్రమోషన్‌కు రావడం ఎంతో సంతోషంగా ఉంది. సినిమా నంబర్ల గురించి కాకుండా ప్రేక్షకుల ప్రేమ సంపాదించడమే నాకు ముఖ్యం. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా మా నాన్న విక్రమ్ స్టార్ అయ్యారు. నేను కూడా ఆయనలాగే కష్టపడి తెలుగు వారి అభిమానాన్ని పొందాలని కోరుకుంటున్నాను" అని ధ్రువ్ అన్నారు. తనకు తెలుగులో డైలాగ్స్ రాసిచ్చింది 'హాయ్ నాన్న' డైరెక్టర్, తన స్నేహితుడు శౌర్య అని ఆయన తెలిపారు.

కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ, దర్శకుడు మారి సెల్వరాజ్ దర్శకత్వంలో పనిచేయాలన్న తన కల ఈ చిత్రంతో నెరవేరిందని చెప్పారు. "మారి సెల్వరాజ్ మొదటి సినిమా చూసినప్పటి నుంచే ఆయనతో పనిచేయాలని ఉండేది. ఈ సినిమా ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ధ్రువ్ డెడికేషన్ చూసి నిజంగా ఆశ్చర్యపోయాను. తమిళంలో వచ్చిన అద్భుతమైన స్పందన తెలుగులో కూడా వస్తుందని నమ్ముతున్నాను" అని ఆమె అన్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, నీలం స్టూడియోస్ పతాకాలపై పా. రంజిత్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రానికి మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. అర్జున అవార్డు గ్రహీత, కబడ్డీ క్రీడాకారుడు మణతి గణేశన్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. క్రీడా స్ఫూర్తితో పాటు సామాజిక అంశాలను స్పృశిస్తూ రూపొందిన ఈ చిత్రం ఈ నెల 24న జగదంబే ఫిల్మ్స్ బ్యానర్‌పై తెలుగులో విడుదల కానుంది.

# వరప్రసాద్ సెట్ లో పెళ్లి కాని ప్రసాద్..!

అనిల్ రావిపూడి డైరెక్షన్ లో మెగాస్టార్ చిరంజీవి లీడ్ రోల్ లో వస్తున్న సినిమా మన శంకర వర ప్రసాద్. ఈ సినిమాలో నయనతార హీరోయిన్ గా నటిస్తుంది. సినిమాకు భీంస్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నాడు. ఇప్పటికే మన శంకర వరప్రసాద్ గారు నుంచి వచ్చిన టీజర్ తో పాటు మీసాల పిల్ల సాంగ్ చార్ట్ బస్టర్ గా నిలిచింది. ఈ సినిమాలో చిరంజీవిని వింటేజ్ కామెడీ టైమింగ్ తో చూపించే ప్రయత్నం చేస్తున్నాడట అనిల్ రావిపూడి. ఐతే మన శంకర వరప్రసాద్ సినిమాలో విక్టరీ వెంకటేష్ క్యామియో కూడా ఉంటుందని తెలుస్తుంది. అనిల్ రావిపూడి వెంకటేష్ కాంబినేషన్ లో 3 సూపర్ హిట్ సినిమాలు.. సినిమాలో వెంకటేష్ రోల్ ఏంటన్నది తెలియదు కానీ చిరంజీవి, వెంకటేష్ ఇద్దరు స్క్రీన్ మీద అలా మెరిసే సీన్స్ అన్నీ నెక్స్ట్ లెవెల్ అనిపిస్తాయట. అనిల్ రావిపూడి వెంకటేష్ కాంబినేషన్ లో 3 సూపర్ హిట్ సినిమాలు వచ్చాయి. ఈ సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. వెంకటేష్ సెంటిమెంట్ ని చిరంజీవి సినిమాకు వాడేస్తున్నాడు అనిల్ రావిపూడి. మన శంకర వర ప్రసాద్ సినిమా షూటింగ్ లో సోమవారం నుంచి వెంకటేష్ పాల్గొన్నారు.

